TGTEL/25/A3603
# కింగ్
డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper
PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA
హైదరాబాద్ సంపుటి: 01 సంచిక: 205 బుధవారం, జూన్ 10, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు
అత్యుత్తమమైన సేవలు,
ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.
జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
మా ప్రత్యేకతలు
• అత్యవసర & క్రిటికల్ కేర్
• ప్రమాద సేవలు
• ప్రసూతి & గైనకాలజీ
• ఆర్థోపెడిక్స్
• జాయింట్ రీప్లేస్‌మెంట్స్
• జనరల్ మెడిసిన్
• జనరల్ సర్జరీ
• మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
• పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
• న్యూరాలజీ • న్యూరోసర్జరీ
• ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
• యూరాలజీ • డెర్మటాలజీ
• సైకియాట్రీ • ఫిజియోథెరపీ


నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్
+91 85230 89599 +91 86889 09384
www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# అతివల చేతిలోనే ప్రగతి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించను
- వ్యాపార ప్రణాళికలు వేసుకోండి.. పెట్టుబడులిస్తాం
- స్వయం సహాయక సంఘాలకు మూడు వేల బస్సులనిస్తాం
- పంటల మార్పిడికి మహిళా సంఘాలే చొరవ చూపాలి
- అతివలను విస్మరించిన వారు.. ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు
- ఇందిరా మహిళాశక్తి మహాసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి






హైదరాబాద్: "తెలంగాణ ఆర్థిక ప్రగతి ఆడబిడ్డల చేతిలో ఉంది. వారికి అండగా ఉండే బాధ్యత మాది. ఎవరెన్ని కుట్రలు చేసినా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించబోను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని, తమ ప్రభుత్వంలో దళారులు, దోపిడీదారులకు చోటులేదన్నారు. వచ్చే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో 33 శాతం మంది మహిళలకు ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు. ఆడబిడ్డలను నిర్లక్ష్యం చేసేవారు అధికారంలో ఉండలేరని, మహిళాలోకం పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కింద చేపట్టిన మహిళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన మహిళాశక్తి మహాసభలో సీఎం ప్రసంగించారు. "ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మీదేవితో పోల్చే సంస్కృతి మనది. భూమిని భూమాతగా, దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తాం. చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో మహిళామణులు మన కీర్తిని ప్రపంచానికి చాటారు. మంత్రులుగా, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లుగా, మేయర్లుగా ఆడబిడ్డలు రాణించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని 2013లో సోనియాగాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారు. రాబోయే రోజుల్లో 33 శాతం మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగం కాబోతున్నారు. గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లు ఒక్క మహిళకూ మంత్రిగా అవకాశం కల్పించలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏనాడూ పార్టీ అధ్యక్ష పదవి మహిళకు ఇవ్వలేదు.

**గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాలివ్వలేదు**

ప్రజాప్రభుత్వం వచ్చిన 48 గంటల్లోనే శాసనసభ సాక్షిగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. కొందరు కడుపునిండా విషం నింపుకొని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని రద్దు చేయాలని రోడ్డెక్కారు. అయినా వెనక్కి తగ్గకుండా ఆ పథకాన్ని కొనసాగిస్తున్నాం. ఇందుకోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం. ఉచితబస్సుల్లో వెళ్లి మన ఆడబిడ్డలు ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. చదువు మానేసే వారి సంఖ్య తగ్గిపోయింది. గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ. 4 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను ఎగ్గొట్టింది. మేం అధికారంలోకి రాగానే వాటిని మంజూరు చేశాం. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పని మహిళా సంఘాలకు అప్పగించాం. ఐకేపీ సెంటర్ల ద్వారా మహిళా సమాఖ్యలకు రూ.159 కోట్ల ఆదాయం వచ్చింది. అంబానీల మాదిరిగా మహిళలు పెట్రోల్‌బంకులు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నాం. అదానీతో పోటీపడేలా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నాం. కార్పొరేట్ కార్యాలయాలకు దీటుగా ఇందిరా మహిళాశక్తి భవనాలను నిర్మిస్తున్నాం. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి హైటెక్ సిటీలో రూ.వెయ్యి కోట్ల స్థలంలో 106 స్టాళ్లు ఏర్పాటు చేశాం. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాం.

**ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో పర్యటిస్తా**

మహిళా సంఘాల సభ్యుల సంఖ్య 67 లక్షల నుంచి కోటికి చేరాలి. రూ.60 వేల కోట్ల రుణాలతో సంఘాలను ఆర్థికంగా నిలబెడుతున్నాం. మూడు వేల బస్సులకు ఆడబిడ్డలను యజమానులుగా చేస్తాం. దీని కోసం జిల్లా, మండల, గ్రామస్థాయి సమాఖ్యలను ఎంపిక చేయాలి. వ్యవసాయంలో వడ్లు మాత్రమే కాదు.. కందులు, మినుములు, పెసలు, ఇతర పప్పుధాన్యాల పంటలు వేయాలి. కూరగాయలు, పండ్ల తోటలు పెట్టాలి. ఈ దిశగా రైతులను మహిళాసంఘాలే కార్యోన్ముఖులను చేయాలి. మీరే రైతు సమాఖ్యలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరూ కట్టుకోలేదు. మేం అందరూ మెచ్చే చిలకపచ్చరంగు చీరలను కోటి మంది మహిళలకు ఇవ్వబోతున్నాం. 2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తాం. రాబోయే రోజుల్లో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి వస్తాను. మీరు వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. వాటికి పెట్టుబడులు ఇస్తాం. పరిపాలనలో మిమ్మల్ని భాగస్వాములను చేస్తాం. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మీ పేరు మీద ఇచ్చాం. త్వరలో లక్ష ఇళ్లు నిర్మిస్తాం" అని సీఎం తెలిపారు.

**రూ. 500 కోట్ల వడ్డీ లేని రుణాల పంపిణీ**

ఈ సందర్భంగా వడ్డీ లేని రుణాలకు సంబంధించి రూ.500 కోట్లు, మహిళా సమాఖ్యలకు 553 బస్సుల అద్దె ఛార్జీల కింద రూ.20.34 కోట్ల చెక్కును సీఎం ఆయా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు రూ.10,700 కోట్లు ఆదా అయ్యిందన్న అంశానికి ప్రతీకగా.. ఆ మొత్తంతో కూడిన చెక్కును ప్రదర్శించారు. 'మహిళాప్రగతి' మాసపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**వర్షంలో తడుస్తూ సభా వేదిక వద్దకు వస్తున్న ముఖ్యమంత్రి**

మహిళా సంఘాలు ఆర్టీసీకి అద్దెకు ఇస్తున్న 553 బస్సులను.. సభ ప్రారంభానికి ముందు పరేడ్ మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆ వెంటనే వర్షం ప్రారంభమైంది. అక్కడి నుంచి వర్షంలోనే సీఎం, మంత్రులు బస్సు ఎక్కి సభా ప్రాంగణం వద్దకు వచ్చారు. బస్సు నుంచి కిందికి దిగిన తర్వాత వర్షం పెరగడంతో వారు తడుస్తూనే లోపలికి వచ్చారు. ఈ అంశాన్ని సీఎం సభలో ప్రస్తావిస్తూ "ఎల్‌నినో ఉందని, వానలు తక్కువగా కురుస్తాయని వాతావరణశాఖ చెబుతోంది. కానీ మనం 553 బస్సులను ప్రారంభించుకోగానే వరుణదేవుడు కరుణించాడు. ఆయన మహిళా సంఘాలతో కలిసి ఆనందం పంచుకున్నారు" అని సీఎం చమత్కరించారు.

**మహిళల సంతోషం.. భారాసకు దుఃఖం**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యమే కాకుండా.. బస్సులకు యజమానులను చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. మహిళా సంఘాల్లో 12-14 లక్షల మంది నిరక్షరాస్యులున్నారని గుర్తించి చదువులు చెప్పిస్తున్నాం. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంలో మహిళలు సంతోషంగా ఉంటే.. భారాస నాయకులు కన్నీరు పెట్టుకుంటున్నారు. భారాస ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పూర్తిగా విస్మరించింది. అప్పట్లో వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షలు మాత్రమే. వాటిని రూ.10 లక్షలకు పెంచాం. గత ప్రభుత్వంలో రూ.4 వేల కోట్ల వడ్డీ సొమ్ము మహిళలకు ఇవ్వలేదు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక మహిళా సంఘాలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించాం.

# రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తున్నాం : భట్టి




జనగామ: రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. జనగామ జిల్లాలో పర్యటించిన భట్టి విక్రమార్క పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదు? రాష్ట్రం సేకరించిన మొక్కజొన్నను కూడా కేంద్రం కొనుగోలు చేయాలి. 30 లక్షల పంపుసెట్ల విద్యుత్తు బిల్లులు రూ.14వేల కోట్లు డిస్కమ్‌లకు చెల్లిస్తున్నాం. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.5వేల కోట్లు చెల్లిస్తున్నాం. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నాం. దేవాదుల ప్రాజెక్టును గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దేవాదులకు నిధులు మంజూరుతో పనులు వేగంగా సాగుతున్నందున ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు రూ.22వేల కోట్ల రుణమాఫీ చేశాం" అని వివరించారు.

# రైతుల కష్టాన్ని రాజకీయం చేసే పార్టీలను నమ్మరు: మంత్రి తుమ్మల

నేలకొండపల్లి గ్రామీణం, : సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను పాలేరు వరకు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4,900 కోట్లు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల కష్టాన్ని రాజకీయం చేస్తున్న పార్టీలను జన్మజన్మలకీ రైతులు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో డీసీసీబీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో తుమ్మల మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మోటార్లు, పైపులు, పంపుల ఏర్పాటు పనులు మాత్రమే చేశారని.. మిగిలిదంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై



వదిలేశారన్నారు. ప్రాజెక్టులో భాగంగా జూలూరుపాడు టన్నెల్‌ను పూర్తి చేసి వచ్చే ఏడాదికల్లా పాలేరుకు గోదావరి జలాలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నిన్నమొన్నటిదాకా అన్నదాతలను ఇబ్బందులపాలు చేసిన ప్రభుత్వాలు, నాయకులే నేడు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎల్లకాలం ఆశీర్వాదం అందించాలని, పంట మార్పిడి చేయాలని అన్నదాతలను కోరారు. గతంలో కోఆపరేటివ్ బ్యాంకులంటే చిన్నచూపు ఉండేదని, ప్రసుత్తం డీసీసీబీలు కూడా రైతులకు మంచి సేవలందిస్తూ జాతీయ బ్యాంకులను మరిపిస్తున్నాయని మంత్రి పొంగులేటి అన్నారు.

# 'మినరల్ పవర్'గా భారత్‌ను అభివృద్ధి చేస్తాం

**2028లో అధికారంలోకి వస్తాం.. సింగరేణి ఉద్యోగులకు ఐటీ చెల్లింపులు రీయింబర్స్ చేస్తాం**

**డీఎంఎఫ్ నిధుల్ని దారి మళ్లించిన భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాలు**

**క్రిటికల్ మినరల్ల నుంచి కోల్ గ్యాసిఫికేషన్ వరకు భారీ ప్రణాళికలు**

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం భవిష్యత్ క్రిటికల్ మినరల్లపైనే ఆధారపడి ఉందని.. దేశ భద్రత, పారిశ్రామిక అభివృద్ధికి మోదీ ప్రభుత్వం భారీ ప్రణాళికలు రూపొందిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. క్రిటికల్ మినరల్ల నుంచి కోల్ గ్యాసిఫికేషన్ వరకు దేశాన్ని 'మినరల్ పవర్'గా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 2014 నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ సాధించిన విజయాలు, సంస్కరణలపై ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాలకు ఖర్చుచేయాల్సిన డీఎంఎఫ్ నిధుల్ని గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు దారి మళ్లించి ఇతర అవసరాలకు ఖర్చు చేశాయని ఆక్షేపించారు. గత ప్రభుత్వం సిద్దిపేట జిల్లాకు నిధుల్ని తీసుకెళితే.. ప్రస్తుత సీఎం.. ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ కోసం ఖర్చుచేశారని, సింగరేణి నిధుల్ని స్కూళ్లకు వెచ్చిస్తున్నారని విమర్శించారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది భాజపా ప్రభుత్వమేనన్నారు. సింగరేణి ఉద్యోగులు చెల్లిస్తున్న ఆదాయపు పన్ను మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయాలని.. లేదంటే తాము అధికారంలోకి వచ్చాక చేస్తామని ప్రకటించారు.

"20వ శతాబ్దం ఆయిల్ ఎకానమీదైతే, 21వ శతాబ్దం క్రిటికల్ మినరల్స్ ఎకానమీది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై యుద్ధంలో మనం క్రిటికల్ మినరల్లను వాడాం. విషయం తెలిసిన ఒక దేశం భారత్‌కు క్రిటికల్ మినరల్ల సరఫరా నిలిపేసింది. ఇప్పటి వరకు 93 శాతం దిగుమతి చేసుకుంటుండగా.. తాజా పరిణామాల నేపథ్యంలో గనుల శాఖ ద్వారా ఆ పరిస్థితిని మార్చబోతున్నాం. అర్జెంటీనాలో ఐదు క్రిటికల్ మినరల్ బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్య సంస్థ 'కాబిల్' సొంతం చేసుకుంది. త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తాం. ఆస్ట్రేలియా, అమెరికాలతోనూ ఈ ఖనిజం కోసం చర్చలు జరుపుతున్నాం. దేశంలోనూ అన్వేషణ వేగవంతం చేశాం. గుజరాత్, మహారాష్ట్ర, ఏపీ, ఒడిశాలలో క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేస్తాం.

# సంపాదకీయం

బుధవారం, జూన్ 10, 2026

## మోడీ సరికొత్త రికార్డ్...

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తాజాగా సరికొత్త రికార్డు సృష్టించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధాన మంత్రిగా ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను ఆయన తిరగరాశారు. దేశంలో ఒక్క ఒక్కడుగా ఆయన చరిత్ర సృష్టించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిర పేరిట ఉన్న రికార్డును కొన్నాళ్ల కిందట అధిగమించిన మోడీ.. ప్రస్తుతం ఆమె తండ్రి, భారత తొలిప్రధాన మంత్రి చాచా నెహ్రూను కూడా పాలనలో అధిగమించారు. దేశానికి ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన నాయకుడిగా మోడీ సంచలన రికార్డును సొంతం చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి.. మోడీ.. దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసి నేత చరిత్ర సృష్టించనున్నారు. భారతదేశ రాజకీయ, పరిపాలనా చరిత్రలో 2026 జూన్ 10 ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబోతుంది. దేశాన్ని నిరంతరాయంగా అత్యధిక కాలం పాలించిన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న చారిత్రక రికార్డును ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజున అధికారికంగా అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇప్పటి వరకు నిరాఘాటంగా ఆ పదవిలోనే ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో దేశవ్యాప్తగా బీజేపీ ప్రభంజనం సృష్టించి.. మోడీ ప్రధాని అయ్యే అవకాశం కల్పించింది. ఇక, 2024లో బీజేపీకి ఒంటరిగా సీట్లు తగ్గినప్పటికీ.. మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ, జనసేన సహా.. అనేక చిన్నా చితకా పార్టీల మద్దతుతో మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అలంకరించారు 12 ఏళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం అనేక పరివర్తనలకు సాక్ష్యంగా నిలిచిందని, ఈ మార్పుల్లో ప్రధానమైనది పేద, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమేనని అన్నారు. ప్రధాని మోడీ వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, స్వచ్ఛ భారత్, పిఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలను ఉదహరించిన మోడీ, ప్రజలకు గౌరవం, అవకాశాలు దక్కేందుకు తమ ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతుందన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ 'అంత్యోదయ' నుండి ప్రేరణ పొందిందని, దశాబ్దాలుగా వెనుకబడిన వారికి అభివృద్ధి ద్వారా వచ్చే ప్రయోజనాలు చేరేలా చూడటమే తమ లక్ష్యమని ప్రధాని అన్నారు. పేదలకు మెరుగైన జీవన నాణ్యతను అందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించడం కూడా ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు, డిజిటల్ వేదికల ద్వారా మద్దతు ప్రజలకు ప్రత్యక్షంగా, పారదర్శకంగా చేరుతోందన్నారు. 'ఇది లీకేజీలను తగ్గించింది, సామర్థ్యాన్ని మెరుగుపరిచింది మరియు పాలనపై నమ్మకాన్ని బలోపేతం చేసింది. ఈ విధంగా 'గరీబ్ కల్యాణ్' ను ముందుకు తీసుకెళ్లే ప్రయాణం మానవ సాధికారత దిశగా, మన వికసిత్ భారత్ కలను సాకారం చేసే దిశగా సమిష్టి ఉద్యమంగా మారింది' అని ప్రధాని పేర్కొన్నారు. 2024 పార్లమెంటరీ ఎన్నికలలో విజయం సాధించిన తరువాత, జూన్ 9,2024న మోడీ వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రెండవ పదవీకాలం 2019 మే 30న ప్రారంభమైంది. గతంలోనూ మూడు సార్లు ప్రధాని అయిన వారు ఉన్నా.. వరుసగా.. ప్రధాని కావడం, సుదీర్ఘకాలం వరుసగా పాలన సాగించే విషయాల్లో మోడీనే ఫస్ట్ నిలిచారు. 2014, మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ నెల 10వ తేదీ నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. ఇది దేశంలోనే అత్యధిక రికార్డు. 1952.. మే 13న దేశ తొలి ప్రధానిగా నెహ్రూ ప్రమాణం చేశారు. ఆయన 1964, మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోడీ తోసిపుచ్చి.. తానే సరికొత్త రికార్డును సృష్టించారు. బుధవారం నాటికి మోడీ 4,399 రోజులపాటు వరుసగా పీఎం సీటులో కూర్చున్న ఏకైక నేతగా నిలిచారు. ఇక, ఇందిరమ్మ విషయానికి వస్తే.. మధ్యలో ఓడినా.. మొత్తంగా 4077 రోజుల పాటు భారత దేశానికి ఏకైక మహిళా ప్రధానిగా పనిచేశారు. అయితే.. ఈ రికార్డును గత ఏడాదే మోడీ అధిగమించారు. 2025, జులై 25న 4,078 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోడీ నమోదు చేయడం గమనార్హం. భారతదేశం 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల దేశం. మన యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి, విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు భారతదేశ వృద్ధికి చోదక శక్తులుగా ఉన్నాయి. గత 12 సంవత్సరాలుగా, భారతదేశం 'సంస్కరించు, సాధించు, పరివర్తన చెందు' అనే నినాదంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రభుత్వ రాజకీయ సంకల్పంతో, ఈ సంస్కరణల రథం పూర్తి వేగంతో దూసుకుపోతోంది. నేడు భారతదేశానికి ప్రతిష్ట, విస్తృతి, డిమాండ్, స్థిరత్వం, అన్నింటికంటే ముఖ్యంగా 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం ఉన్నాయి. అందువల్ల, సంకల్పంతో కూడిన పెట్టుబడుల వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక ఇప్పటి వరకు ప్రధాని మోదీ 44 అంతర్జాతీయ గుర్తింపులు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో ఏదేశాధినేతకు దక్కని గౌరవం నరేంద్ర మోదీకి దక్కింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి పునాదులు వేయడం నెహ్రూ కాలపు అవసరమైతే.. భారీ ప్రభుత్వ ప్రణాళికల నుండి చురుకైన, సాంకేతికత ఆధారిత పంపిణీ వ్యవస్థ ద్వారా భారతదేశాన్ని ఒక అంతర్జాతీయ ఆర్థిక శక్తిగా నిలపడం ప్రధాని మోదీ పదవీకాలపు ముఖ్య లక్షణంగా నిలిచింది. 2026 బుధవారం మోదీ దాటనున్న ఈ చారిత్రాత్మక మైలురాయి, ఇరవై ఒకటవ శతాబ్దపు నవ భారత పరిపాలనకు ఒక స్పష్టమైన నిర్వచనాత్మక నమూనా. మోడీ సాధించిన ఈ రికార్డును అధిగమించే పరిస్థితి కనుచూపు మేరలో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

- ఎడిటర్

# జార్ఖండ్ లో నత్వానీ వర్సెస్ విజయసాయి...

రాంచీ, జూన్ 9, (న్యూస్ పల్స్)జార్ఖండ్ రాజకీయాల్లో జూన్ 18న జరగబోయే రాజ్యసభ ఎన్నికలు ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష కూటముల మధ్య సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి వచ్చినట్లే కనిపించినా, తెరవెనుక జరుగుతున్న సమీకరణాలు సరికొత్త సస్పెన్స్‌ను రేకెత్తిస్తున్నాయి. జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల వేళ రాంచీ నుండి ఢిల్లీ వరకు పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగింది. అధికార ఇండియా కూటమిలో జార్ఖండ్ ముక్తి మోర్చా , కాంగ్రెస్ మధ్య నెలకొన్న వివాదం ఎట్టకేలకు సమసిపోయింది. సీఎం హేమంత్ సోరెన్, కాంగ్రెస్ పరిశీలకుల మధ్య జరిగిన చర్చల అనంతరం.. జేఎంఎం తరపున మాజీ మంత్రి బైద్యనాథ్ రామ్, కాంగ్రెస్ తరపున ఏఐసీసీ సెక్రటరీ ప్రణవ్ ఝా బరిలోకి దిగుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి 28 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం కాగా, అధికార కూటమికి 56 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఈ లెక్కన కూటమిలోని రెండు సీట్లు సులభంగా గెలిచే అవకాశం ఉన్నప్పటికీ, తెరవెనుక జరుగుతున్న 'థర్డ్ క్యాండిడేట్' వ్యూహాలు ఇప్పుడు అందరినీ ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో అసలైన సస్పెన్స్ ఎక్కడ మొదలైందంటే.. నామినేషన్ల దాఖలుకు సమయం దగ్గర పడుతున్న వేళ ముగ్గురు ప్రముఖులు నామినేషన్ పత్రాలను కొనుగోలు చేయడం కలకలం రేపింది. బీజేపీ ప్రతినిధి గౌరవ్ వల్లభ్, ప్రముఖ పారిశ్రామికవేత్త, సిట్టింగ్ ఎంపీ పరిమళ్ నత్వానితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. విజయసాయిరెడ్డి జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ పత్రాలు తీసుకోవడం జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, అసలు ఏపీకి చెందిన విజయసాయిరెడ్డి జార్ఖండ్ నుండి నామినేషన్ పేపర్లు ఎందుకు కొనుగోలు చేశారు? ఎవరి కోసం కొనుగోలు చేశారు? అనే ప్రశ్నలు ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి. విజయసాయిరెడ్డి స్వయంగా పోటీ చేయడానికి ఈ పత్రాలను కొనుగోలు చేయలేదని, దీని వెనుక ఒక పెద్ద కార్పొరేట్, జాతీయ రాజకీయ వ్యూహం దాగి ఉందనే ప్రచారం జరుగుతోంది. పారిశ్రామికవేత్త పరిమల్ నత్వానికి మద్దతుగా , ఎన్డీయే కూటమి తరపున వ్యూహాత్మక డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు, ఏదైనా ఊహించని పొలిటికల్ ఈక్వేషన్ మారితే రంగంలోకి దిగడానికి క్లియర్ రూట్ ఉంచుకునేలా ఆయన ఈ పత్రాలను సేకరించినట్లు తెలుస్తోంది. గతంలో పరిమల్ నత్వాని జార్ఖండ్ నుండి పోటీ చేసినప్పుడు జేఎంఎం మద్దతు ఇచ్చింది. ఇప్పుడు కూడా నత్వాని స్వయంగా సీఎం హేమంత్ సోరెన్‌ను కలవడం, ఈ పరిణామాలన్నింటినీ విజయసాయిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లుగా నామినేషన్ పత్రాలు తీసుకోవడం వెనుక ఆయనకు ఉన్న అపారమైన ఫైనాన్షియల్ , పొలిటికల్ నెట్‌వర్కింగ్ కారణమని భావిస్తున్నారు. ప్రస్తుతం జార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎంకు 34 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందులో ఒక అభ్యర్థి విజయానికి 28 ఓట్లు పోగా, ఇంకా 6 అదనపు ఓట్లు మిగిలి ఉంటాయి. ఈ ఆరు ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఝాకు బదిలీ చేస్తామని జేఎంఎం బహిరంగంగా చెబుతున్నప్పటికీ, లోపల మాత్రం ఇంకా ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సరిగ్గా ఈ ఆరు ఓట్లను, అలాగే ప్రతిపక్ష బీజేపీ , దాని మిత్రపక్షాల ఓట్లను నమ్ముకునే పరిమల్ నత్వాని ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకు స్కెచ్ వేశారు. ఒకవేళ నత్వాని గనుక ఎన్డీయే మద్దతుతో రంగంలోకి దిగితే, కాంగ్రెస్ అభ్యర్థి విజయం కష్టతరంగా మారుతుంది. మొత్తంగా చూస్తే, జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి ఎంత మంది ఫైనల్‌గా బరిలో ఉంటారనే దానిపై క్లారిటీ రానుంది. బీజేపీ తొలుత గౌరవ్ వల్లభ్‌ను రంగంలోకి దించాలని భావించినా, . మరి ఈ కార్పొరేట్ చదరంగంలో విజయసాయిరెడ్డి కొనుగోలు చేసిన నామినేషన్ పత్రాల వెనుక ఉన్న అసలైన లబ్ధిదారుడు ఎవరు? జేఎంఎం ఆరు మిగులు ఓట్లు ఎటు వైపు పడతాయి? అనేది రాబోయే రెండు రోజుల్లో తేలిపోనుంది.

# 2028 కోసం జనబంధన్ అడుగులు

న్యూఢిల్లీ,జూన్ 9, (న్యూస్ పల్స్)దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ప్రతిపక్ష ఇండియా కూటమి రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు, 2029 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై వ్యూహాలను సిద్ధం చేయడానికి ఈ భేటీని ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరగనున్న ఈ ఇండియా జనబంధన్ సమావేశానికి మొత్తం 23 ప్రతిపక్ష పార్టీలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేలతో పాటు పలు లెఫ్ట్ పార్టీలు, చిన్న పార్టీల నేతలు పాల్గొననున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ (పశ్చిమ బెంగాల్), డీఎంకే (తమిళనాడు) పరాజయం పాలవడంతో కూటమిలో సమీకరణాలు మారాయి. ముఖ్యంగా బెంగాల్‌లో తమ నేతలపై జరుగుతున్న దాడుల అంశాన్ని టీఎంసీ ఇక్కడ లేవనెత్తనుంది. అలాగే కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్–బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందంటూ వచ్చిన ఆరోపణలపై సీపీఐ(ఎం) పార్టీ కాంగ్రెస్ నాయకత్వాన్ని వివరణ కోరనుంది. కూటమిలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పేర్కొన్నప్పటికీ, కొన్ని కీలక పార్టీలు ఈ భేటీకి దూరం కావడం గమనార్హం. ఈ ప్రతిపక్షాల ఐక్యతా రాగానికి గండి కొడుతూ అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకే ప్రభుత్వంలో చేరడంతో డీఎంకే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే నిన్ననే మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు కేజ్రీవాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపినట్టుగా సమాచారం. కొన్ని పార్టీలు వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోతున్నప్పటికీ, మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశాయి. ఈ ప్రతిపక్షాల భేటీపై అధికార బీజేపీ తీవ్రంగా మండిపడింది. కూటమిలోని అంతర్గత లేఖలను ప్రస్తావిస్తూ బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమికి ఎలాంటి మిషన్ (లక్ష్యం), విజన్ లేవని వారిలో ఉన్నదల్లా కేవలం కన్ఫ్యూజన్, డివిజన్, పరస్పర ఆరోపణలు, పదవుల కోసం ఆరాటం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఏదేమైనప్పటికీ, దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి జాతీయ అంశాలపై ఉమ్మడి ముఖచిత్రాన్ని ప్రదర్శించేందుకు ప్రతిపక్షాలు ఈ వేదికను వాడుకోనున్నాయి.

## లక్ష డాలర్ల ఫీజు.. తలబొప్పి కట్టింది.

న్యూఢిల్లీ,జూన్ 9 (న్యూస్ పల్స్)దెబ్బ మీద దెబ్బ.. ఇది మామూలు దిబ్బ కాదు. ట్రంప్ దిమ్మ తిరిగిపోయే దెబ్బ. కాళ్ళ కింద భూమి కంపించి పోయే దెబ్బ. ఇక జన్మలో ఆ మాట కూడా ఎత్తడానికి కూడా భయపడే దెబ్బ.. అమెరికాలో ఏకచత్రాధిపత్యంగా.. మూర్ఖుడి మాదిరిగా నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్ కు అక్కడి కోర్టు తిరుగులేని తీర్పు ఇచ్చింది. ఇకపై జన్మలో ఆ ఊసు ఎత్తడానికి కూడా వణుకు పుట్టేలా చేసింది. ట్రంప్ తన పరిపాలన నిర్లక్ష్యాన్ని ప్రపంచ మీద రుద్దడానికి రకరకాల విన్యాసాలకు పాల్పడుతున్నాడు. ప్రపంచ దేశాల మీద అనవసరమైన సుంకాలు విధించడం.. ఇంకా లేనిపోని షరతులు విధించడం.. యుద్ధాలు చేయడం.. ఇలాంటి ఎన్నో దారుణాలకు పాల్పడుతున్నాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే. ట్రంప్ తీసుకున్న మరో దారుణమైన నిర్ణయం అమెరికా కంపెనీలకు కోలుకోలేని ఇబ్బందిగా మారింది. అమెరికా యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశం లో భాగంగా.. అమెరికన్ కంపెనీల పై ట్రంప్ ప్రత్యేకమైన రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు.. ప్రత్యేకమైన నైపుణ్యాల కోసం విదేశీ కార్మికులను నియమించుకునే యాజమాన్యాలు లక్ష డాలర్లు రుసుము చెల్లించాలని ట్రంప్ ఒక పనికిమాలిన విధానాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. దీనిపై నిరసనలు వ్యక్తమయ్యాయి. ట్రంప్ తీసుకొని నిర్ణయం పట్ల అమెరికా కాంగ్రెస్ కూడా ఆమోదం తెలపలేదు. దీనిని చట్ట విరుద్ధమైన పన్ను అని బోస్టన్ ఫెడరల్ కోర్టు అభిప్రాయపడింది. విదేశాల నుంచి వచ్చే వృత్తి నిపుణులకు హెచ్ 1 బీ వీసాలు ఇవ్వడానికి లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని కోర్టు మండిపడింది. ట్రంప్ తీసుకున్న నిర్ణయం చెల్లదని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియోసోరోకిన్ అత్యంత చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు.. గత ఏడాది సెప్టెంబర్ లో ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాలలో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా ఆయన హెచ్1బికి ఎంపికైన వారు లక్ష డాలర్ల ఫీల్ చెల్లించాలని ఒక విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. దీనిని దాదాపు 20 రాష్ట్రాల అటార్నీ జనరల్ తీవ్రంగా తప్పుపట్టారు. అదే కాదు పోస్ట్ అని కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని జడ్జి విచారించారు. లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని మండిపడ్డారు..అది పెనాల్టీ ఎలా అవుతుంది. అలా తీసుకోవడానికి మీరెవరు. అటువంటి విధానం అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లేకుండా ఎలా సాధ్యమవుతుంది. అమెరికా అధ్యక్షుడు ఇటువంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని"కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. "కళాశాలలు.. ఆస్పత్రులు.. వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగులను నియమించుకోవడానికి మా సామర్థ్యానికి మించి లక్ష డాలర్ల రుసుము చెల్లించాలంటే ఇబ్బందిగా ఉండేదని" ఆయా రాష్ట్రాలకు చెందిన అటార్నీ జనరల్స్ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును కోర్టు తీవ్రంగా పరిగణించి.. ట్రంప్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. ఇక జన్మలో లక్ష డాలర్ల రుసుము వసూలు చేయాలనే ఆలోచన ట్రంప్ మదిలో ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఒక్కో పోస్టుకు 88 మంది అభ్యర్థులు

లక్నో, జూన్ 9, (న్యూస్ పల్స్)ఓ చేత్తో డిగ్రీ పట్టా.. మరో చేత్తో ఖాళీ పొట్ట పట్టుకుని తిరుగుతున్నాం సార్. ఉద్యోగం ఎవడూ ఇవ్వడం లేదు. ఎక్కడికి వెళ్లినా రిఫరెన్సులు అడుగుతున్నారు. ఉద్యోగం ఇవ్వకుంటే అనుభవం ఎక్కడి నుంచి వస్తుంది.. ఈ దేశం ఇలా నాశనం అవుతోంది అంటే దానికి ప్రధాన కారణం మీరే సార్. మీరు ఉద్యోగాలు ఇవ్వరు. మమ్మల్ని బతకనివ్వరు" అప్పట్లో విపరీతంగా ప్రాచుర్యం పొందిన ఓ చిత్రంలో కథానాయకుడు చెప్పిన డైలాగ్ ఇది. ఆ సినిమా ఇప్పటికాలానికి నిజంగా సరిపోతుంది. కొన్ని సంవత్సరాల క్రితమే ఇప్పటి పరిస్థితి ఊహించి ఆ సినిమా తీసినట్టు కనిపిస్తోంది. ఆ సినిమాలో మాదిరిగానే ఇప్పుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగులు హాహా కారాలు చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ కు భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఆ పోటీ ఎంతలా ఉందంటే ఒక్క ఉద్యోగానికి దాదాపు 88 మంది దరఖాస్తు చేసుకునేలా.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 32,679 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు దాదాపు 28.86 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రకారం ఒక్కొక్క పోస్టుకు 88 మంది పోటీ పడుతున్నారు. మూడు రోజులపాటు రాధా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తండోపతండాలుగా వెళ్లిపోతున్నారు. అభ్యర్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రవాణా ఏర్పాటు చేయలేకపోవడంతో.. రైల్వే స్టేషన్ లు.. బస్ స్టేషన్లలో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. దీంతో తర్వాత పరీక్షకు హాజరు కావడానికి అభ్యర్థులు మొత్తం కిక్కిరిసి వెళ్ళిపోవాల్సి వస్తోంది.

# నీట్ ఎక్స్‌పర్ట్స్ లాక్ డౌన్..

న్యూఢిల్లీ,జూన్ 9, (న్యూస్ పల్స్)వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ 2026 రీ ఎగ్జామినేషన్‌కు ముహూర్తం దగ్గరపడుతుండటంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసాధారణమైన భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టింది. మే 3న జరిగిన మొదటి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఎన్‌టీఏ.. ఈసారి జూన్ 21న జరగబోయే రీ టెస్ట్ విషయంలో జీరో ఎర్రర్ పాలసీని అమలు చేస్తోంది. పేపర్ లీకేజీకి అస్సలు ఛాన్స్ లేకుండా పేపర్ తయారీ దశ నుంచే ఊహించని రేంజ్‌లో కట్టుదిట్టమైన కమాండో తరహా భద్రతను ఏర్పాటు చేసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నీట్ రీ ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో భాగస్వాములైన సబ్జెక్ట్ నిపుణులు, పర్యవేక్షకులు, వివిధ భాషల్లోకి అనువదించే ట్రాన్స్‌లేటర్లతో కూడిన యావత్ టీమ్‌ను కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో ఒక అత్యంత రహస్య ప్రాంతంలో లాక్‌డౌన్ చేశారు. ఈ లాక్‌డౌన్ ప్రాంగణంలో ఉన్నవారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలాంటి కమ్యూనికేషన్ పరికరాలనూ అనుమతించడం లేదు. కేవలం ముందస్తు అనుమతి పొందిన ప్రత్యేక సిబ్బందికి మాత్రమే ఈ జోన్‌లోకి ప్రవేశం ఉంటుంది. జూన్ 21న పరీక్ష ముగిసేంతవరకు ఈ నిపుణుల బృందం బయటి ప్రపంచానికి పూర్తిగా దూరంగా ఇదే నిఘా నీడలో గడపనుందిగతంలో రవాణా, స్టోరేజ్ దశల్లోనే లీకేజీలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో.. ఈసారి ఎన్‌టీఏ సరికొత్త మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను రంగంలోకి దించింది. క్వశ్చన్ పేపర్ల ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజ్ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే వరకు ప్రతి దశలోనూ బహుళ అంచెల నిఘా ఉంటుంది. అత్యంత కీలకమైన విషయం ఏంటంటే.. ఈ ప్రశ్నపత్రాల రవాణా కోసం ఈసారి భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రైవేట్ రవాణా సంస్థల జోక్యం తగ్గి.. పేపర్లు అత్యంత సురక్షితంగా జిల్లాలకు చేరుకుంటాయి. ఇదిలా ఉండగా.. రీ ఎగ్జామ్ పేపర్ కూడా ముందే లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వార్తలు చక్కర్లు కొట్టడంపై ఎన్‌టీఏ తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని, మోసపూరితమైనదని స్పష్టం చేసింది. ఇలాంటి పుకార్లను నమ్మి అభ్యర్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి ఫేక్ ప్రచారం చేసే అకౌంట్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షలో లీకేజీ కలకలం రేగడంతో.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మే 12న ఆ పరీక్షను ఎన్‌టీఏ అధికారికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు నీట్ యూజీ రీ ఎగ్జామినేషన్ జరగనుంది. లక్షలాది మంది విద్యార్థులు హాజరవుతున్న ఈ పరీక్షను ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా ముగించేందుకు కేంద్ర విద్యాశాఖ, ఎన్‌టీఏ సర్వసన్నద్ధమయ్యాయి.

# తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

నిజామాబాద్, జున్9:దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. మహిళా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులు సీఎం చేతుల మీదుగా బస్సులు అందుకునేందుకు బయలుదేరిన మహిళలు



ఇందల్వాయి టోల్ ప్లాజా నుండి జెండా ఊపి ప్రారంభించారు. మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభుత్వం కృషి ఒక్కో బస్సు రూ . 36లక్షలు,నియోజకవర్గంలో 7 ఆర్టీసీ బస్సులు కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న బృహత్తర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 7 మండలాల మహిళా సమాఖ్యలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఆర్టీసీ బస్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు 7 బస్సుల్లో హైదరాబాద్ కు బయలుదేరగా.. మంగళవారం ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, వ్యాపారాలు విస్తరించేందుకు ఒక్కో బస్సు పై రూ.6 లక్షలు మహిళా సంఘాల కాంట్రిబ్యూషన్ రూ. 30లక్షల బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణాలతో నియోజకవర్గ పరిధిలో 7 బస్సులు జిల్లా మొత్తంగా 28 బస్సులను ఈరోజు సీఎం చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. అటు మహిళలకు వడ్డీలేని రుణాలు అందించడం .. మహిళలు తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ కల్పించడం కోసం హైదరాబాద్ శిల్పారామంలో ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

# 'పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి'

## సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



అనంతగిరి, జూన్ 09 : పెరిగిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు నిరసిస్తూ ఈ నెల 10న సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం అనంతగిరి మండలంలోని శాంతినగర్ లో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు వ్యతిరేకంగా నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతున్నాయన్నారు. నిరసన కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, శాంతినగర్ మాజీ సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ఎర్రసాని రవి, మండల సహాయ కార్యదర్శి లాలు, లింగయ్య, చంద్రయ్య, చిన్న సూరయ్య, నారాయణ, వీరన్న, కాసిం సాహెబ్, వీరాచారి, వెంకటేశ్వర్లు, నరసింహారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# 'రైల్వే విస్తరణలో ఇళ్లు, ఉపాధి కోల్పోయాం.. ఆదుకోవాలి'

## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి బాధితుల వినతి



బీబీనగర్, జూన్ 09 : రైల్వే ప్రాజెక్టు కారణంగా ఇళ్లు, ఉపాధి కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బీబీనగర్ మండలానికి చెందిన బాధితులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిను కలిశారు. బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తమ సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రాజెక్టు భూసేకరణ వల్ల ఇళ్లు, జీవనాధారం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ప్లాట్లు కోల్పోయిన వారికి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం సత్వరమే చెల్లించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.ప్రాజెక్టు ప్రభావంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి తగిన సహాయం అందించాలని కోరారు. దీనిపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కట్ట వినోద్, నాయకులు రోడ్డ శ్రీనివాస్, రైల్వే ప్రాజెక్టు బాధితులు పాల్గొన్నారు.

# ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఉండదు.. కీలక ప్రకటన చేసిన తమిళనాడు స్పీకర్


తమిళనాడు : అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామికి ఎదురు దెబ్బ తగిలింది. విప్ ఆదేశాలను ఉల్లంఘించి టీవీకే ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేసిన 21 మంది అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ తిరస్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..మొదట 25 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పళనిస్వామి ఒక పిటిషన్ సమర్పించారని తెలిపారుఈ అంశంపై పళనిస్వామి నాలుగు వేర్వేరు లేఖలు పంపారని, ఆ



21 మంది ఎమ్మెల్యేలను క్షమించాలని కోరుతూ పళనిస్వామి అసెంబ్లీకి లేఖ రాశారని, దీనినే పరిగణలోకి తీసకున్నామని ఆయన పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం స్వయంగా వారిని మన్నించాలని కోరినందున, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆ 21 మందిపై ఎలాంటి అనర్హత చర్యలు ఉండవని స్పీకర్ స్పష్టం చేశారు. నిర్ణయం తీసుకునే ముందు రాజ్యాంగపరమైన అంశాలను, అసెంబ్లీ నిబంధనల ప్రకారం వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.ఓటింగ్ సమయంలో ఇదే గ్రూపులో ఉన్న మరో నలుగురు ఎమ్మెల్యేలు (పెరుందురై జయకుమార్, మరకథం కుమారవేల్, ఇసక్కి సుబ్బయ్య, సత్యభామ) అంతకుముందే తమ పదవులకు రాజీనామా చేసి టీవీకే పార్టీలో చేరారని వారిపై కేసులు పరిశీలనలో ఉన్నాయని, విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ప్రకటన చేస్తా మని స్పీకర్ పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయంతో ఏఐడీఎంకేలో రాజకీయ మునలం అలముకున్నన్నట్లయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొద్దిమందిపై మాత్రమే క్రమశిక్షణ చర్యలను పరిమితం చేస్తూ మెజారిటీ ఎమ్మె ల్యేలను క్షమించాలన్న పార్టీ నాయకత్వ నిర్ణయంపై పట్ల ఆ పార్టీలో కొంత మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# జీతాలు ఇవ్వకుండా వేధింపులు.. కాంగ్రెస్ సర్కార్‌కు అంగన్ వాడీల ఉసురు తగులుతుంది : హరీశ్ రావు

మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి.. ముందు అంగన్ వాడీలకు జీతాలు చెల్లించి, మహిళల పట్ల నీకున్న గౌరవాన్ని నిలబెట్టుకో అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు.రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల అంగన్ వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా..? నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్ వాడీలను వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు



తగులుందన్నారు. మహిళా మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.అంగన్ వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్ వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారు. వారి గౌరవాన్ని పెంచారు.2014 నాటికి అంగన్ వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్నిరూ.7,800లకు, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారన్నారు.అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారు. మాయ మాటలు చెప్పి, రెండున్నరేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీ లేదు, గతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్ధాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని హరీశ్ రావు మండిపడ్డారు.సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన అంగన్ వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించిన దుర్మార్గమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి, మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. రెండు నెలలుగా పెండింగ్ లో ఉన్న అంగన్ వాడీల వేతనాలను చెల్లించాలని, అప్ గ్రేడ్ చేసిన మినీ అంగన్ వాడీలకు ఏడాదిగా పెండింగ్ లో ఉన్న పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# రిజైన్ చేసి హ్యాపీగా వెళ్లిపోవచ్చు... రెబల్ ఎంపీలకు టీఎంసీ ఘాటు సందేశం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు పలువురు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమితో కలిసి పనిచేయనున్నట్లు ప్రకటించడంపై ఆ పార్టీ అధినాయకత్వం తొలిసారి స్పందించింది. ఇది ముమ్మాటికీ నయవంచనేనని టీఎంసీ సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అన్నారు. మంగళవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, ద్వంద్వ వైఖరి కలిగిన వ్యక్తులు పార్టీ నుంచి వెళ్లిపోవడమే మంచిదని అన్నారు. పార్టీ పట్ల అంతగా అసంతృప్తి ఉంటే వాళ్లు రాజీనామా చేయాలన్నారు.'రెండు రకాల వ్యక్తిత్వాలు కలిగిన వ్యక్తులు వెళ్లిపోతే మాకు కూడా చాలా సంతోషం. వెళ్లిపోవాలనుకునే వాళ్లు వెళ్లిపోవచ్చు. మాకెలాంటి అభ్యంతరాలులేవు. అయితే మీరు తృణమూల్ కాంగ్రెస్ పేరును మాత్రం తీసుకెళ్ల లేరు. ప్రజలకు నిజం ఏమిటో తెలుసు, వాళ్లు మావెంటే నిలుస్తారు' అని కల్యాణ్ బెనర్జీ అన్నారు. పార్టీతో ఎవరికైనా విభేదాలుండి పార్టీలో ఇమడలేమని అనుకున్నా, ఇందుకు బదులుగా ఎవరికైనా మద్దతు ఇవ్వాలని అనుకున్నా పార్టీకి రాజీనామా చేయడం కనీస నైతిక బాధ్యత అని అన్నారు.తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకరుకు లేఖ రాసి ఉంటే అందులోని సమాచారం ఎందుకు బయటపెట్టడం లేదని కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. 'ఎంతమంది ఆ లేఖలో సంతకం




చేశారో, ఎందరు చేయలేదో నాకు తెలియదు. దీనిపై ఎవరెవరు ఏమి మాట్లాడుతున్నారో కూడా తెలియదు. లేఖ రాసిన 24 గంటల తర్వాత కూడా ఎందుకు దానిలోని విషయాలను బహిరంగం చేయడం లేదు. ఎవరూ ఆ లేఖను చూడలేదు. ఇలాంటి కీలక విషయంలో నిజాయితీ అనేది అవసరం' అని అన్నారు. తిరుగుబాటు ఎంపీలకు మరో పార్టీతో విలీనం అయ్యేంత సంఖ్యాబలం లేదన్నారు. అందువల్ల ఏ ఒక్క ఎంపీని బీజేపీ తీసుకోదని ధీమా వ్యక్తం చేశారు.

# సింగరేణిని దోచుకుంటున్న ప్రభుత్వం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్, జూన్ 09: సింగరేణి సంస్థ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. కానీ ఆ సంస్థను ప్రభుత్వమే దోచుకుంటుందని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. జూన్ 5వ తేదీన 26 లక్షల 28 వేల మెట్రిక్ టన్నులు బొగ్గు ఉందని ప్రెస్ రిలీజ్ చేశారని వివరించారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెబుతున్నారని పేర్కొన్నారు.బుధవారం ఉదయం 11.00 గంటలకు ఆ బొగ్గు నిల్వలను చూపించాలని మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. 3 లక్షలకు పైగా బొగ్గు నిల్వ ఉందన్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తాను, మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరమే అక్కడికి వెళ్తామన్నారు. బొగ్గు నిల్వ లేకపోతే తప్పు చేశామని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సింగరేణి విషయంలో వేలు పెట్టలేదని గుర్తు చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణిలో ఆయన వేలు పెట్టారని స్పష్టం చేశారు. రెండు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేని పరిస్థితి సింగరేణిలో నెలకొందన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మాట్లాడలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు.సింగరేణిలో 26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుపై సీబీసీఐడీతో విచారణ జరిపేలా ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. రూ. 4 వేల కోట్ల ఓడీ ఎందుకు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆయన బల్లగుద్ది ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్‌తోపాటు కిషన్ రెడ్డి కూడా బాధ్యత వహించాల్సి ఉందన్నారు.గతంలో సింగరేణిలో 20 వేల ఉద్యోగాలు ఉండే.. కేసీఆర్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కారుణ్య నియామకాలు కింద 16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. దీంతో ఆ సంస్థలోని 36 వేల మంది ఉద్యోగులు నష్టపోయేలా పరిస్థితి ఉందన్నారు. బొగ్గు లేకుండా ఎందుకు ఆదాయపు పన్ను కట్టారో చెప్పాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.



# డీకేకు తప్పని తిప్పలు.. అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మంత్రులు..



బెంగళూరు, జూన్ 9: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివ కుమార్‌కు మంత్రుల నుంచి తిప్పలు తప్పటం లేదు. శాఖల కేటాయింపు విషయంలో సీనియర్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామలింగారెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజులకే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రామలింగారెడ్డి ఆకస్మాత్తుగా రాజీనామా చేయటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధిష్ఠానం కృష్ణ బైరే గౌడకు గ్రేటర్ బెంగళూరు డెవలప్‌మెంట్ ఫోర్ట్‌ఫోలియో కేటాయించింది. అయితే, ఆయన ఇప్పటివరకు ఆ శాఖ బాధ్యతలు తీసుకోలేదు.విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. రామలింగారెడ్డి ఫోర్ట్‌ఫోలియో విషయంలో నెలకొన్న సందిగ్ధత కారణంగా బైరే గౌడ ఇంకా పదవి బాధ్యతలు చేపట్టలేదు. రామలింగారెడ్డికి గ్రేటర్ బెంగళూరు డెవలప్‌మెంట్ ఫోర్ట్‌ఫోలియో ఇస్తానని అధిష్ఠానం మాటిచ్చింది. కానీ, ఆ శాఖను బైరే గౌడకు కేటాయించి.. రామలింగారెడ్డికి ఇరిగేషన్ శాఖ కేటాయించింది. దీంతో ఆగ్రహానికి గురైన రామలింగారెడ్డి జూన్ 5వ తేదీన పదవికి రాజీనామా చేశారు. ఇక, అప్పటినుంచి గ్రేటర్ బెంగళూరు డెవలప్‌మెంట్ ఫోర్ట్‌ఫోలియో విషయంలో సందిగ్ధత నెలకొంది.ఆ శాఖను రామలింగారెడ్డికి కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఫోర్ట్‌ఫోలియో విషయంలో క్లారిటీ తెచ్చుకోవడం కోసం అధిష్ఠానాన్ని కలవడానికి బైరే గౌడ ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే రిజ్వాన్ కూడా ఢిల్లీ వెళ్లారు. త్వరలో క్యాబినెట్ విస్తరణ జరగనుంది. మంత్రి పదవి ఆశిస్తూ రిజ్వాన్ ఢిల్లీ వెళ్లారు. క్యాబినెట్‌లో 21 ఖాళీలు ఉండటంతో ఔత్సాహికులు తమ అదృష్టం పరీక్షించుకోవడానికి ఢిల్లీ బాటపడుతున్నారు. ఇది వరకే మంత్రి పదవి పొందిన వారు మాత్రం తమ శాఖల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నేతల అసంతృప్తి కారణంగా డీకే శివకుమార్ ఇబ్బందుల్లో పడిపోయారు.

# దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను ఎస్సీలుగానే గుర్తించాలి

## దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్




న్యూఢిల్లీ, జూన్ 9 దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను ఎస్సీలుగానే గుర్తించాలని జాతీయ దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. దళితులు మతం మారినంత మాత్రాన వారి కులం మారినట్లు కాదన్నారు. క్రైస్తవం, ఇస్లాంలోకి వెళ్లిన దళితులను, ముస్లింలోని దూదేకుల, నూర్‌భాషా వర్గాలను ఎస్సీలుగా గుర్తించకపోతే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో జాతీయ దళిత జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. మతం మారిన దళితులను టార్గెట్ చేస్తూ వారిపై కేంద్రంలోని బీజేపీ సర్కారు వివక్షను చూపుతోందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆరోపించారు. ఎస్సీలపై దేశవ్యాప్తంగా దాడులు పెరుగుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు అందరూ ఒక తాటిపైకి రావాల్సిన అవసరముందని మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ దళిత క్రైస్తవులకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

# రైతులకు బీజేపీ శనిలా తయారైంది: వేముల వీరేశం

హైదరాబాద్, జూన్ 9: తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు బీజేపీ ఓ శనిలా తయారైందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలు.. ప్రధాని మోదీకి చెప్పి ధాన్యం కొనుగోలు చేయిస్తారని రైతులు ఎదురు చూశారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలతో రైతులకు ఎలాంటి లాభం లేదని వ్యాఖ్యానించారు. రైతుల ముందు మోదీనే మోకరిల్లిన చరిత్రను బీజేపీ నాయకులు మరిచిపోయారా అని ప్రశ్నించారు.నల్ల చట్టాలని వెనక్కి తీసుకున్న చరిత్ర మోదీది అంటూ వీరేశం వ్యాఖ్యానించారు. 15వ తేదీలోపు రాష్ట్రంలో ప్రతి గింజా కొనుగోలు చేస్తామని బీజేపీ ప్రకటించాలని.. లేదంటే బీజేపీ నాయకుల ఇళ్లు ధాన్యంతో నిండిపోతాయన్నారు. రైతుల కోపానికి బీజేపీ బలికాక తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఉందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసేది బీజేపీ అయితే.. బీజేపీకి బీ టీమ్‌గా బీఆర్ఎస్ పని చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం లేకున్నా పెద్ద ఎత్తున పంట వస్తే అసత్య రాజకీయ క్రీడకి తెరలేపారంటూ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.





# బ్రహ్మోస్ కు ఫుల్ డిమాండ్...

న్యూఢిల్లీ, జూన్ 9, (న్యూస్ పల్స్)ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసింది. పాకిస్తాన్‌లోని నిర్దిష్ట లక్ష్యాలపై దాడి చేయడంతోపాటు పాకిస్తాన్ చేసిన ప్రతిదాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా భారత్ జరిపిన దాడులతో ప్రపంచం దృష్టి ఒక్కసారిగా భారత ఆయుధాలపై పడింది. ఆపరేషన్ సిందూర్‌లో మన బ్రహ్మోస్ మిస్సైల్ సమర్థవంతంగా పనిచేసింది. దీంతో అత్యాధునిక సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను కొనుగోలుకు చాలా దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. తాజాగా దక్షిణ తూర్పు ఆసియా దేశాలకు విక్రయించడంలో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. సింగపూర్‌లో జరిగిన షాంగ్రి?లా డైలాగ్‌లో భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, వియత్నాంతో ఒప్పందం ఇప్పటికే సంతకం అయిందని, ఇండోనేషియాతో చర్చలు తుది దశలో ఉన్నాయని ప్రకటించారు. ఇది భారత రక్షణ ఎగుమతుల రంగంలో కొత్త అధ్యాయం.వియత్నాంతో 2012 నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. 14 ఏళ్ల తర్వాత ఒప్పందం ఖరారైంది. అయితే ఒప్పంద విలువ, ఎన్ని క్షిపణులు అందించాలనే వివరాలు ఇంకా గోప్యంగా ఉన్నాయి. ఇండోనేషియాతో కూడా చర్చలు దగ్గరలో ముగిసే దశలో ఉన్నాయి. ఇంతకు ముందు 2022లో ఫిలిప్పీన్స్‌తో సంతకం చేసిన 375 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 3,100 కోట్లు) ఒప్పందం కింద మూడు బ్రహ్మోస్ వ్యవస్థలను అందించాల్సి ఉంది. ఇప్పటికే రెండు సెట్లు డెలివరీ అయ్యాయి. ఫిలిప్పీన్స్ వీటిని తన తీరప్రాంత రక్షణ కోసం మోహరించింది.వియత్నాం?చైనా మధ్య దక్షిణ చైనా సముద్రంలో సరిహద్దు వివాదం ఉంది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ విక్రయం చైనా అసంతృప్తిని రేకెత్తించవచ్చని భారత్ గతంలో జాగ్రత్తగా వ్యవహరించింది. ఇప్పుడు ఒప్పందం ఖరారు కావడం దక్షిణ తూర్పు ఆసియాలో చైనా ప్రభావానికి వ్యతిరేకంగా భారత్ సక్రమమైన రణనీతిని అవలంబిస్తోందని సూచిస్తుంది.భారత్?రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణికి భారతప్రదేశ్ బ్రహ్మపుత్ర నది, రష్యా మాస్క్వా నది పేర్లను కలిపి పెట్టారు. హైదరాబాద్‌లో తయారవుతుంది. దీని బరువు సుమారు 3 వేల కిలోలు. పొడవు సుమారు 10 మీటర్లు. దీని దాడి పరిధి 300 కిలో మీటర్లు. ఇటవల భారత సాంకేతికతతో 500 కిలోమీటర్లకు పెంచారు. గంటకు సుమారు 4 వేల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. భూమికి చాలా దగ్గరగా పయనిస్తూ రాడార్‌లకు తప్పించుకుంటుంది. లక్ష్యాన్ని అత్యంత కచ్చితంగా ఛేదిస్తుంది.బ్రహ్మోస్ అణ్వాయుధాలను మోసుకెళ్లలేని కన్వెన్షనల్ క్షిపణి కాబట్టి అంతర్జాతీయ ఒప్పందాల పరిమితులు లేకుండా ఎగుమతి చేయవచ్చు. దీనిలో 85 శాతం సాంకేతికత భారత్ సొంతం. మిగిలిన 15 శాతం (ప్రధానంగా ఇంజిన్, కొన్ని లోహ భాగాలు) రష్యా నుంచి వస్తాయి.ఫిలిప్పీన్స్, వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు బ్రహ్మోస్‌ను ఎంచుకోవడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఇది ఇప్పటికే యుద్ధక్షేత్రంలో పరీక్షించి నిరూపించుకున్న విజయవంతమైన క్షిపణి.పశ్చిమ దేశాలు లేదా ఇతర మేజర్ సరఫరాదారుల కంటే తక్కువ ఖర్చు.భారత్ శిక్షణ, మోహరింపు సహాయం, స్పేర్ పార్ట్స్‌ను తక్కువ ధరకు లేదా ఉచితంగా అందిస్తోంది. ఈ క్షిపణిని భూమి నుంచి, నౌకలు, జలాంతర్గాములు, విమానాల నుంచి కూడా ప్రయోగించవచ్చు.పెరిగిన భారత రక్షణ ఎగుమతులు.. కొన్ని సంవత్సరాల్లో భారత రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. 2023?24లో రూ. 21 వేల కోట్లు, 2024?25లో రూ. 28 వేల కోట్లు, 2025?26లో రూ. 38 వేల కోట్లకు చేరాయి. 2029?30 నాటికి రూ. 50 వేల కోట్ల లక్ష్యం నిర్దేశించారు. బ్రహ్మోస్‌తో పాటు ఆకాశ్, పినాకా, డ్రోన్లు, మందుగుండు సామగ్రి వంటివి కీలక పాత్ర పోషిస్తున్నాయి.గతంలో ప్రభుత్వ ఏకస్వామ్యంగా ఉన్న రక్షణ రంగం ఇప్పుడు ప్రైవేట్ సంస్థల సహకారంతో వేగంగా మారుతోంది. ఇది స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) లక్ష్యానికి దోహదపడుతోంది. బ్రహ్మోస్ ఎగుమతులు కేవలం వ్యాపారం కాదు. చైనా ప్రభావం ఎక్కువగా ఉన్న దక్షిణ తూర్పు ఆసియాలో భారత్ తన రణనీతి, సాంకేతిక సామర్థ్యం, విశ్వసనీయతను ప్రదర్శిస్తున్న సంకేతం. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా చూడడం భారత రక్షణ రంగానికి పెద్ద విజయం.

# రేవంత్ రాజకీయం నార్త్ జనానికి దూరమౌతున్న కాంగ్రెస్

హైదరాబాద్, జూన్ 9, (న్యూస్ పల్స్)తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల జాతీయ వేదికలపై  దక్షిణాది ఆత్మగౌరవ వాదాన్ని అత్యంత అగ్రెసివ్‌గా వినిపిస్తూ దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపారు. ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన , కేంద్రం నుంచి వచ్చే నిధులు , పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి. మేము కేవలం పన్నులు చెల్లిస్తూ, ఢిల్లీకి సలాం కొట్టే ద్వితీయ శ్రేణి పౌరులం కాబోం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవేదన మాత్రమే కాదు.. ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు.ఒక జాతీయ పార్టీ తరపున ముఖ్యమంత్రిగా ఉంటూ ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది. అదే సమయంలో కర్ణాటక, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ప్రధాన ఆర్థిక, రాజకీయ వనరులుగా మారాయి. ఉత్తరాదిపై ఆశలు వదులుకోకపోయినా, తమకు పెట్టని కోటగా మారిన దక్షిణాదిని మరింత పటిష్టం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగానే రేవంత్ రెడ్డి చేత కాంగ్రెస్ అధిష్ఠానం ఈ తరహా వాయిస్ వినిపిస్తోందని భావించవచ్చు.ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన పిల్లర్ గా రూపాంతరం చెందుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ రెడ్డి గణాంకాలతో సహా హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆయన తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వంటి ఇతర దక్షిణాది నేతలకు లేఖలు రాస్తూ అందరినీ ఏకం చేసే ప్రయత్నం చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీల కంటే తానే ఈ వాదాన్ని బలంగా మోయగలనని నిరూపించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' అంటే 50% సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50% సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం ఆధారంగా కేటాయించాలనే డిమాండ్ ? ఆయన పొలిటికల్ మెచ్యూరిటీని చూపిస్తోంది. దీనివల్ల ఆయన కేవలం గుడ్డిగా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం లేదని, ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది అటు జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీయకుండా, ఇటు దక్షిణాది ప్రయోజనాలను కాపాడే సమతుల్య వ్యూహంగా ఉపయోగపడుతోంది.భవిష్యత్ రాజకీయాల కోణంలో చూస్తే, ఈ 'దక్షిణాది సెంటిమెంట్' రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఢిల్లీ పాలకుల నిర్ణయాల వల్ల దక్షిణాది రాజకీయంగా అణగారిపోతుందనే భయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రాంతీయ సెంటిమెంట్‌ను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేయవచ్చు. అయితే, ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు ఈ వ్యూహం రెండు అంచుల కత్తి లాంటిదే. దక్షిణాదిలో ఈ వాదం మైలేజ్ ఇచ్చినప్పటికీ,

ఉత్తరాది రాష్ట్రాలలో దీనివల్ల కాంగ్రెస్ మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దక్షిణాది హక్కుల కోసం పోరాడే ఒక 'ఫైర్ బ్రాండ్' లీడర్‌గా రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నారు. తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు.. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీంతో భేటీ అయ్యారు. వీరిలో ప్రముఖంగా మునుగోడు ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన సుదీర్ఘ లేఖను రాహుల్‌గాంధీకి అప్పగించారు. తాను పార్టీకి ఎంత విధేయుడినో ఆయన వివరించారు. 15 పేజీల లేఖలో పలు వివరాలను ఆయన వెల్లడించినట్టు తెలిసింది త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న చర్చల నేపథ్యంలో కోమటిరెడ్డి సహా.. సీనియర్ నాయకు లు రాహుల్‌తోభేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఒకసారి మంత్రివర్గాన్ని విస్తరించారు. అప్పట్లో అడ్లూరి లక్ష్మణ్ సహా.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు ఈ కూర్పు జరిగింది. అయితే.. ఇప్పుడు మరోసారి విస్తరించాలని చూస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.ఈ క్రమంలో ఎప్పటి నుంచో మంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి మంత్రి పీఠం కోసం విస్తృ తంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రివర్గంలో సీటును ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా కూడా భావి స్తున్నారు. గత ఆరు మాసాల నుంచి తన వ్యాఖ్యల ద్వారా మరింత వేడి పుట్టిస్తున్నారు. తనకు మంత్రి వర్గంలో ఎందుకు చోటివ్వరంటూ కోమటిరెడ్డి ప్రశ్నించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక, రాష్ట్ర నేతలతో పనికాదనుకున్న ఆయన.. నేరుగా ఢిల్లీ పెద్దలకే విన్నవించారు.

# రేవంత్ వర్సెస్ పవన్

హైదరాబాద్, జూన్ 9, (న్యూస్ పల్స్) సాధారణంగా రాజకీయాలలో కొందరి మధ్య వైరం అనేది అంత ఈజీగా సాధ్యం కాదు. ఎందుకంటే వారి మధ్య అటువంటి వ్యవహారాలు ఎప్పుడూ చోటు చేసుకోవు కాబట్టి.. ప్రజలు ఆ విధంగా ఆలోచించరు. కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.. ఎవరు ఊహించని విధంగా.. కలలో కూడా అనుకోని విధంగా రాజకీయ వైరం ఏర్పడింది. అది కాస్త ఒక రకమైన సంచలనానికి దారితీసింది. ఇది ఎటువైపు వెళుతుంది.. దేని వైపు దారితీస్తుందో చూడాలి.ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల తర్వాత.. అది రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంచలనం సృష్టించిన తర్వాత.. ఈ ఎపిసోడ్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చేసారు. ఆ విశ్లేషకుడిని బాధిత పక్షం లాగా చూపించేందుకు ప్రయత్నాలు చేశారు. ముందుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఈ వ్యవహారంలోకి ప్రవేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను హైదరాబాద్ ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. డిమాండ్ చేశారు. ఆ తర్వాత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజి స్టార్ అంటూ మండిపడ్డారు. ఇక టీఆర్ఎస్ అధినేత్రి పళ్లు రాలుతాయి అంటూ పవన్ కళ్యాణ్ మీద మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్ బిజెపి, బీఆర్ఎస్ కు అమ్ముడుపోయిన వ్యక్తి అని.. ఆయన ఒక ప్యాకెజిస్టార్ అంటూ ఆరోపించారు..ఈ పరిణామాల తర్వాత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను పెద్దగా లెక్కలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎప్పుడైతే హస్తం పార్టీ నాయకులు తనమీద విమర్శలు చేయడం మొదలుపెట్టారో ఆయన నేరుగా రంగంలోకి దిగారు. అంతేకాదు.. తెలంగాణలోని గచ్చిబౌలి ప్రాంతంలో సంధ్య కన్వెన్షన్ హాల్ లో అంతర్గత సమావేశం నిర్వహించుకుంటామని తెలంగాణ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో పవన్ కళ్యాణ్ కు హ్యాండ్ ఇచ్చింది. దీనికి తెలంగాణ పోలీసులు చెప్పిన కారణమేంటంటే.. ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద జనసేన నాయకులు విమర్శలు చేయడం ద్వారా.. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిన్నది.. తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ మీద ఆగ్రహంగా ఉన్నారు.. అందువల్ల ఈ సమావేశానికి అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. జన సేన అధినేత తన గృహం నుంచి విలేకరుల సమావేశం నిర్వహించారు. చాలా ఆవేశంగా మాట్లాడారు. తాను ఇక్కడ పోటీ చేసే విషయం మీద స్పష్టత ఇచ్చారు. పోరాటల పురిటిగడ్డలో ఎందుకు



సమావేశంనిర్వహిస్తున్న విషయం మీద కూడా క్లారిటీ ఇచ్చారు. జనసేన అధినేత మీద కవిత ఆరోపణలు చేస్తే ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఆమెకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. అందువల్లే ఆమె అలా చేస్తుందనుకోవచ్చు. భారత రాష్ట్ర సమితి పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే.. దాన్ని కూడా ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే భారత రాష్ట్ర సమితికి ఆంధ్రా ప్రాంతం మీద.. అక్కడి రాజకీయ నాయకుల మీద విమర్శలు చేస్తేనే ఆ పార్టీకి మనుగడ. అదే గనుక లేకపోతే ఆ పార్టీకి తెలంగాణలో కొనసాగింపు ఉండదుభారత రాష్ట్ర సమితి నుంచి కవిత వరకు ఏపీ డిప్యూటీ సీఎం మీద విమర్శలు చేశారంటే దాని వెనక ఒక అర్థం ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు ఈ స్థాయిలో జనసేన అధినేత మీద విమర్శలు చేయడం నిజంగా ఆశ్చర్యం. రేవంత్ రెడ్డి ఆదేశాల లేకుండా వారు ఇలా చేశారనుకోవడానికి లేదు. కానీ ఈ ఉద్దేశ్యాలు ఆశించి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి విమర్శలు చేస్తుందో అర్థం కావడం లేదు..త్వరలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. అలాంటప్పుడు తెలంగాణ సెంటిమెంట్ రగిలితేనే ఓట్లు పడతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందువల్లే జనసేన అధినేత మీద ఈ స్థాయిలో విమర్శలు చేసినట్టు కనిపిస్తోంది. కానీ హైదరాబాదులో సెటిలర్ ఓటర్లు చాలా ఎక్కువగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే..ఆంధ్రా వాదం మీద ఆరోపణలు చేస్తే అప్పుడు ఆ ఓట్లు వేరే పార్టీ వైపు వెళ్లే అవకాశం ఉంది.మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని జనసేనాని స్పష్టం చేశారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ఎందుకు అతడిని టార్గెట్ చేసినట్టు.. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. మన పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్లో కూడా రాజకీయాలు చేస్తోంది. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ ఇలాంటి వైఖరి ఎందుకు తీసుకున్నారు.. భారత రాష్ట్ర సమితికి అవకాశం ఇవ్వకూడదనా.. పవన్ కళ్యాణ్ వస్తే భారత రాష్ట్ర సమితికి ప్రయోజనం దక్కుతుందనా.. ఈ ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులు వేస్తున్నారు.. ఒకవేళ ఇదే విధానం కనుక రేవంత్ రెడ్డిది అయితే.. ఆయన ముందుగానే మేల్కొన్నట్టు..కానీ, గత ఎన్నికల్లో సెటిలర్ ఓటర్లు భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు చూపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ రెడ్డి కొనసాగించిన వైఖరి వల్ల వారి ఓట్లు ఎటువైపు వెళ్తాయో చూడాల్సి ఉంది. కాకపోతే ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్న వ్యాఖ్యల ద్వారా గోటితో పోయే వ్యవహారాన్ని ఇక్కడ దాకా తీసుకొచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చారు. అయితే ఇది ఎక్కడదాకా దారి తీస్తుందో చూడాల్సి ఉంది.

# శాటర్ డే.. నో బ్యాగ్ డే

వరంగల్, జూన్ 9, (న్యూస్ పల్స్)తెలంగాణలోని పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈసారి కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్యాలెండర్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో.. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు నిర్వహించాలనే నిబంధనను విద్యాశాఖ పొందుపరిచింది.కొత్త నిబంధనల ప్రకారం.. పాఠశాలల్లో పిల్లలకు సాధారణ బోధనతో పాటు ప్రతిరోజూ క్రీడలు నిర్వహించాలి. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు కథల పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు లాంటి వాటిని రోజుకు అరగంట పాటు చదివించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు, ప్రార్థన సమయంలో లేదా అది పూర్తయిన తర్వాత తరగతి గదిలో ఐదు నిమిషాల పాటు విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించటం తప్పనిసరి చేశారు.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు మొత్తం 227 రోజుల పాటు పనిచేస్తాయి. పదో తరగతి సిలబస్‌ను 2027 జనవరి 10వ తేదీ నాటికి, మిగిలిన తరగతులకు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని అధికారులు గడువు విధించారు. వచ్చే ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినంగా ఉంటుంది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 24 నుంచి జూన్ 13వ తేదీ వరకు (2027) వేసవి సెలవులు ఉంటాయి. 2027 మార్చి 15 నుంచి చివరి పనిదినం వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. తొలిసారిగా ఈ ఒంటిపూట బడుల తేదీలను విద్యా క్యాలెండర్‌లోనే ముందుగా ప్రకటించడం విశేషం.ఇక ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులకు నో బ్యాగ్ డేగా అమలు చేస్తారు. అదే రోజున అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాలు కూడా జరపాలి. 1 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు భోజన విరామం తర్వాత సెప్టెంబరు వరకు ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై ప్రత్యేకంగా రెమిడియల్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల చదువులో వెనుకబడిన విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకునే అవకాశం లభిస్తుంది. కాగా.. మే 14న ప్రారంభమైన బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 19 వరకు కొనసాగించాలని విద్యాశాఖ ఆదేశించింది. అలాగే.. గత ఏడాది స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను 6 నుంచి 7కు పెంచగా.. ఈసారి మళ్లీ వాటిని 6కు తగ్గించారు. ఈ సమావేశాలు జులై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు, ఫిబ్రవరి నెలల్లో జరుగుతాయి.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ సైన్స్ ప్రదర్శనల షెడ్యూల్‌ను క్యాలెండర్‌లో చేర్చారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26 జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌ను అక్టోబరులో నిర్వహించనున్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి పోటీలను నవంబరు లేదా డిసెంబరులో, రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబరు లేదా జనవరిలో జరుపుతారు. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2027 జనవరిలో నిర్వహించనున్నారు.

# రాంగ్ రూట్ లో వస్తే అడ్డంగా బుక్కైనట్టే...

## 100 ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలు..

హైదరాబాద్, జూన్ 9, (న్యూస్ పల్స్)ట్రాఫిక్ పోలీసులు లేరు కదా అని కాస్త దూరం తగ్గించుకోవడానికి అడ్డదారిలో బండి నడిపితే ఇకపై నేరుగా కెమెరా కంటికి చిక్కాల్సిందే. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ విభాగం పూర్తిగా సిద్ధమైంది. అడ్డదారిలో వెళ్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే క్షణాల వ్యవధిలోనే మొబైల్‌కు ఈ-చలానా సందేశం వచ్చేలా ఏర్పాట్లు చేశారు. పదేపదే ఇలాంటి తప్పులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా పోలీసులు వెనుకాడటం లేదు.నగరవ్యాప్తంగా వాహనదారులు అడ్డదారిలో ప్రయాణిస్తున్నట్లు సుమారు 200కు పైగా ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. వీటిలో అత్యంత ప్రధానమైన 100 మార్గాల్లో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించి, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నేరుగా జరిమానాలు విధిస్తున్నారు.ఎలాగైనా వెంటనే గమ్యస్థానానికి చేరాలనే తొందరతో వాహనదారులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ సంవత్సరం కేవలం 5 నెలల వ్యవధిలోనే రాంగ్‌రూట్ ప్రయాణాల వల్ల 50కి పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో కుటుంబానికి ఆధారమైన ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉంటాయని, పోలీసులు ఉండరనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.ఎదురుగా వాహనాలు వేగంగా దూసుకొస్తున్నా వినకుండా అడ్డదారిలో వచ్చే వాహనదారులు, పోలీసుల తనిఖీల్లో పట్టుబడినప్పుడు రకరకాల సాకులు చెబుతున్నారు. చుట్టూ తిరిగి రావడం ఇబ్బందని, కొద్ది దూరమే కదా వచ్చామంటూ మాయమాటలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరైతే అడ్డదారిలో రావడమే కాకుండా పోలీసులతో గొడవకు దిగుతూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై ప్రతి నెల నమోదవుతున్న కేసుల్లో సగానికి పైగా (20 మందిపై కేసులు నమోదైతే అందులో 10 మంది) రాంగ్ సైడ్‌లో వచ్చే వాహనదారులే ఉంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.మలుపులు దూరంగా ఉన్నాయని కాలనీల్లోకి వెళ్లేందుకు రాంగ్‌సైడ్‌ను ఎంచుకునే వాహనదారులు, ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను తొలగించడం లేదా మార్చడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. నగరంలో కేవలం ఒక నెల వ్యవధిలోనే రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై 30 ప్రాంతాల్లోనే ఏకంగా 2 లక్షలకు పైగా ఈ-చలానాలు నమోదు కావడం ఈ ఉల్లంఘనల తీవ్రతను నిరూపిస్తోంది.నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్న ప్రాంతాలుగా షేక్‌పేట్, ఫిలింనగర్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, టోలిచౌకి, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, అత్తాపూర్, చార్మినార్, అబిడ్స్, నారాయణగూడ, ఖైరతాబాద్, పంజాగుట్ట, బేగంపేట్, అమీర్‌పేట్, రాణిగంజ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అఫ్జల్‌గంజ్, కాచిగూడ, సుల్తాన్‌బజార్ వంటి నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రదేశాలలో అడ్డదారి ప్రయాణాల వల్ల తరచూ తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

# ఏపీలో సరికొత్త సోషల్ ఇంజనీరింగ్

విజయవాడ, జూన్ 9, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త సోషల్ ఇంజనీరింగ్ ప్రయోగానికి జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. కేవలం ఒకే వర్గానికి పరిమితమైన పార్టీగా జనసేనపై ప్రత్యర్థులు వేస్తున్న ముద్రను చెరిపేస్తూ.. కులాలను కలపడం అనే తన మూల సిద్ధాంతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో సీరియస్ గా అమలు చేస్తున్నారు. ఎన్నికల విజయం అనంతరం ఆయన తీసుకుంటున్న రాజకీయ నిర్ణయాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను గమనిస్తే, రాష్ట్రంలో సుస్థిరమైన రాజకీయాలు, సామాజిక సమతుల్యతను సాధించడమే లక్ష్యంగా పవన్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.జనసేన పార్టీకి కాపు సామాజికవర్గం ప్రధాన కోర్ ఓటు బ్యాంక్ అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, ఆ వర్గానికి సముచిత ప్రాధాన్యత ఇస్తూనే, ఇతర సామాజికవర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా పవన్ కల్యాణ్ సమదృష్టిని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం జనసేన తరఫున గెలిచిన ఇద్దరు లోక్‌సభ ఎంపీలు కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో.. తాజాగా వచ్చిన రాజ్యసభ ఎంపీ స్థానాన్ని ఇతర వర్గానికి కేటాయించడం ఆయన రాజకీయ పరిణతికి నిదర్శనం. రాజకీయాల్లో కేవలం సమీకరణాలకే పరిమితం కాకుండా, పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందనే బలమైన భరోసాను ఆయన ఈ నిర్ణయం ద్వారా క్యాడర్‌కు పంపారు.ఈ సామాజిక సమతుల్యతపై పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో పార్టీ కోసం పనిచేసి, ప్రస్తుతం పార్టీలో లేని జేడీ లక్ష్మీనారాయణ లాంటి నేతలను ఆయన ప్రస్తావిస్తూ.. ఒకవేళ ఆయన ఇప్పుడు పార్టీలో ఉండి ఉంటే కచ్చితంగా ఈ రాజ్యసభ అవకాశం ఆయనకే ఇచ్చి ఉండేవారిని ఓపెన్‌గా ప్రకటించారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థం ఒక్కటే.. పార్టీ కోసం నిబద్ధతో పనిచేసే వారి విషయంలో తాను కులమతాల పట్టింపులను అస్సలు చూడనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కేవలం ఒకే కులం ముద్ర పడకుండా, సర్వమానవ సమానత్వం అనే జనసేన ఆశయాలకు అనుగుణంగా ఆయన నడుచుకుంటున్న తీరు విశ్లేషకులను సైతం ఆకర్షిస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి కేవలం ఐదేళ్ల పరిపాలనకే పరిమితం కాకూడదని, రాబోయే పదిహేనేళ్ల పాటు ఈ బంధం బలంగా కొనసాగాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షిస్తున్నారు. ఈ సుదీర్ఘ రాజకీయ ప్రయాణం సాధ్యం కావాలంటే కేవలం పార్టీ అగ్రనాయకత్వాలు కలిస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో విభిన్న కులాలు, వర్గాల మధ్య సఖ్యత ఏర్పడాలని ఆయన బలంగా నమ్ముతున్నారు.

ఈ 'కులాల కలయిక' అనే కాన్సెప్ట్ సక్సెస్ అయితేనే కూటమి సుస్థిరంగా ఉంటుందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన ఒక దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళుతున్నారు.రాజకీయంగా ఈ విధమైన సోషల్ ఇంజనీరింగ్ ప్రయోగాలు గతంలో చాలా తక్కువ మంది నేతలే చేశారు. ప్రాంతీయ పార్టీలు సాధారణంగా తమ కోర్ ఓటు బ్యాంక్‌ను దాటి బయటకు రావడానికి సాహసించవు. కానీ పవన్ కల్యాణ్ భవిష్యత్తు రాజకీయాల కోసం ఈ రిస్క్ తీసుకుంటున్నారు. పార్టీ అంతర్గత పదవుల నుంచి, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల వరకు అన్ని వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు , మైనారిటీలకు తగిన ప్రాధాన్యత కల్పించేలా ఆయన ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నారు. ఇది కేవలం ఎన్నికల లబ్ధి కోసం చేసిన తాత్కాలిక వ్యూహం కాదని, ఏపీ రాజకీయాల్లో ఒక శాశ్వత మార్పు కోసం వేస్తున్న పునాది అని చెప్పవచ్చు. పవన్ కల్యాణ్ అనుసరిస్తున్న ఈ వైఖరి జనసేన పార్టీని ఒక సరికొత్త లీగ్‌లోకి తీసుకెళ్లింది. "అధికారాన్ని పంచుతూ అందరినీ కలుపుకుపోతా" అనే స్థాయికి ఆయన ఎదిగారు. కులాల మధ్య ఉన్న అంతరాలను తొలగించి, రాజకీయంగా అందరికీ భాగస్వామ్యం కల్పించాలనే ఆయన ప్రయత్నం ఏ మేరకు సఫలీకృతమవుతుందో రాబోయే రోజుల్లో తేలనుంది.

# మేకపాటి ఫ్యామిలీలో ఆస్తుల వార్

నెల్లూరు జూన్ 9, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాకు చెందిన పొలిటికల్ ఫ్యామిలీ మేకపాటి కుటుంబంలో ఆస్తుల రచ్చ రోడ్డుకెక్కింది. ఈ కుటుంబం నుంచి పలువురు నాయకులు రాజకీయాల్లో ఉన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆయన సోదరులు.. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డిలతోపాటు.. మేకపాటి విక్రమ్ రెడ్డి(రాజమోహన్‌రెడ్డి కుమారుడు) ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన మేకపాటి గౌతం రెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. దాదాపు 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఈ కుటుంబానికి నెల్లూరులో మంచి పేరుందిమేకపాటి రాజమోహన్‌రెడ్డి నెల్లూరు ఎంపీగా పలుమార్లు విజయం దక్కించుకున్నారు. ఇక, మేకపాటి చంద్రశేఖరరెడ్డి కూడా ఉదయగిరి నియోజకవర్గం నుంచి పలుమార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డి మాత్రం వైసీపీ తరఫున ఉదయగిరి నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్‌గా ఉన్నారు. అయితే.. ఇప్పటి వరకు వీరి కుటుంబ ఆస్తులపై వివాదాలు చెలరేగిన దాఖలాలు లేవు. కానీ, తొలిసారి మేకపాటి చంద్రశేఖరరెడ్డి మీడియా సమావేశం పెట్టి మరీ.. కుటుంబ ఆస్తుల వివాదాలపై మాట్లాడారు.తనకు రెండు పెళ్లిళ్లు జరిగాయని.. ఈ నెపాన్నిచూపించి.. తన సోదరులు రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆస్తులను పంచడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చంద్రశేఖరరెడ్డి వయసు 63 ఏళ్లు. అయితే.. ఆయన ఆస్తుల వివాదంతో రోడ్డెక్కడం అందరినీ విస్మయానికి గురి చేసింది. తన సోదరుడు రాజమోహన్‌రెడ్డి తనకు ఆస్తులు పంచడం లేదని.. రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడు తాను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని.. ఈ విషయాన్ని పదే పదే చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. మేకపాటి కుటుంబం స్వతంత్రంగా వ్యవహరించడం లేదని జగన్ చెప్పినట్టు ఆడుతున్నారని ఆయన విమర్శించారు.వైసీపీని వీడి.. టీడీపీలో చేరినందుకే.. తనకు ఆస్తులు పంచకుండా జగన్ తెరవాటున అడ్డు పడుతున్నారని చంద్రశేఖర్‌రెడ్డి దుయ్యబట్టారు. చెల్లికి, తల్లికి కూడా ఆస్తులు పంచని వాడు.. వారిని ఇంటి నుంచి వెళ్లగొట్టిన వాడు చెబితే.. రాజమోహన్‌రెడ్డి ఎలా వింటున్నారని ప్రశ్నించారు.ఉమ్మడి ఆస్తిలో తనకు రూపాయిపంచినట్టు చెప్పినా.. తను ఏమి అడగబోనన్నారు. దీనిపై బహిరంగ చర్చకు కూడా తాను సిద్ధమేనని అన్నారు. జగన్ కారణంగానే వైసీపీ నాశనం అయిందని, ఇంకా అవుతుందని చెప్పారు. సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి మళ్లీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వ్యాఖ్యానించారు.

# గోదారోళ్లు... ఆ మాత్రం ఉండాల్సిందే...

రాజమండ్రి, జూన్ 9, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించారు. సిద్ధాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలలో పరిశ్రమలు కోసం భూములు కావాలంటే ఇచ్చేందుకు ముందుకు వస్తారని.. కానీ గోదావరి జిల్లాలలో సెంటు భూమి కూడా ఇచ్చేందుకు అంగీకరించరంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.గోదావరి జిల్లాలలో భూముల ధరలు భారీగా ఉండటంతో భూమిని సేకరించడం కష్టంగా ఉందనే అభిప్రాయాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. రాయలసీమ, విశాఖ జిల్లాలలో రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తుండటంతో అక్కడికి పరిశ్రమలు వస్తున్నాయని.. గోదావరి జిల్లాలలో భూములు ఇచ్చేందుకు ముందుకు రాకపోవటంతో పరిశ్రమలు తక్కువగా వస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.ఉభయ గోదావరి జిల్లాలలో భూముల ధరలు ఎక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. వ్యవసాయం, పారిశ్రామికీకరణ, రవాణా సౌకర్యాలు, నగరీకరణ వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణాలు. డెల్టా ప్రాంతంలోని సారవంతమైన నేలలు వ్యవసాయానికి అత్యంత అనుకూలం. దీంతో ఇక్కడి రైతులు వరితో పాటుగా చేపలు, రొయ్యల సాగు వంటి ఆక్వాకల్చర్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. వాణిజ్య పంటలు బాగా పండే కారణంగా గోదావరి జిల్లాలలో భూములకు మంచి డిమాండ్ ఉంటుంది. ఆక్వా సాగు ద్వారా లాభాలు గడిస్తూ ఉండటంతో ఇక్కడి రైతులు భూములు అమ్మేందుకు ఆసక్తి చూపించరు. అలాగే ఈ జిల్లాల మీదుగా జాతీయ రహదారులు, రైల్వేలైన్లు ఉండటంతో వీటికి ఆనుకుని ఉన్న భూముల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి.ఇక కాకినాడ, ఏలూరు, రాజమండ్రి, భీమవరం, అమలాపురం, పాలకొల్లు వంటి పట్టణాలు క్రమంగా విస్తరిస్తూ ఉండటంతో.. ఈ ఏరియాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ పెరుగుతోంది. ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారు.. తిరిగి ఇక్కడ పెట్టుబడులు పెడుతూ ఉండటం కూడా భూముల ధరలు పెరగడానికి కారణమని నిపుణులు చెప్తున్నారు.

# అనకాపల్లి జిల్లాలో 'రియల్' బూమ్ షురూ


విశాఖపట్టణం, జూన్ 9, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా జిల్లాల వారీగా అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ఆయా రంగాల వారీగా ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాలకు పరిశ్రమలు, కంపెనీలను తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. పారిశ్రామిక ప్రగతితో నగరాలు, పట్టణాలతో పాటుగా పల్లె ప్రాంతాల రూపురేఖలు మార్చే ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. కూటమి ప్రభుత్వ ప్రయత్నాలతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుండటంతో.. జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ప్రగతి వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒకప్పుడు బెల్లం, చెరకు, మామిడికి ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా ఇప్పుడు పరిశ్రమలను ఆకర్షించడంలో ముందంజలో ఉంది. ఆర్‌ఎస్‌ఎల్ఆర్ మిట్టల్, వారీ ఎనర్జీస్, లారస్ ల్యాబ్స్, బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్, లిథియం అయాన్ సెల్ ఫ్యాక్టరీ తదితర కంపెనీలు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటవుతున్నాయి. ఆర్‌ఎస్‌ఎల్ఆర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కావడంతోపాటు.. నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడటంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది.అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురంలో అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. ఎస్ రాయవరం, నక్కపల్లి, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో స్థిరాస్తి రంగం ఇటీవల కాలంలో బాగా పుంజుకుందని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి జిల్లాలో ఎకరం భూమి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉండేదని.. ఇప్పుడు ఎకరా రూ.కోటి వరకు పలుకుతోందని టాక్ వినిపిస్తోంది. విశాఖపట్నం తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనకాపల్లి జిల్లావైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు వ్యాపారులు అనకాపల్లి జిల్లాలో స్థలాల కొనుగోలుపై ఫోకస్ పెట్టినట్లు చెబుతున్నారు. నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఆర్‌ఎస్‌ఎల్ఆర్ మిట్టల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో స్థలాలకు గిరాకీ పెరిగిందంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో భూముల ధరలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల భూములకు డిమాండ్ పెరగడంతో ఇటీవల కాలంలో ఈ జిల్లాలో రిజిస్ట్రేషన్లు కూడా భారీగా పెరిగాయి.అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి నుంచి భోగాపురం



వరకు సెమీ రింగ్ రోడ్డు కూడా సిద్ధమవుతోంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే గంటన్నరలోనే భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లొచ్చు. సెమీ రింగ్ రోడ్డు రాకతో అనకాపల్లి జిల్లా మరింత అభివృద్ధి చెందడం ఖాయమంటున్నారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటైన, త్వరలోనే రాబోతున్న పరిశ్రమలకు ఎయిర్‌పోర్టు అనుసంధానం వరంగా మారనుంది. అంతే కాకుండా తుని, పాయకరావుపేట సమీపంలో ఎయిర్ స్ట్రిప్ ప్లాన్ చేస్తున్నారు. అనకాపల్లి - పాయకరావు పేట జాతీయ రహదారి వెంట చిన్న చిన్న వ్యాపారాలు మొదలయ్యాయి. విశాఖపట్నంతో అనకాపల్లి జిల్లాకు రోడ్డు అనుసంధానం కూడా పెరగడం కూడా కలిసి వస్తుందని భావిస్తున్నారు. అనకాపల్లి, నక్కపల్లి, పరవాడ, పాయకరావుపేట ప్రాంతాలు పెట్టుబడికి అనుకూలమని కొందరు స్థిరాస్తి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే ఇక్కడ స్థలాల రేట్లు మరింత పెరుగుతాయని.. అనకాపల్లి మెగా స్టీల్ సిటీగా మారబోతుందని అంచనా వేస్తున్నారు.రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు రాబోతున్నాయని.. భవిష్యత్తులో నక్కపల్లి మండలం పరిశ్రమలకు కేంద్రంగా మారబోతుందని భావిస్తున్నారు. ఒకప్పుడు అనకాపల్లి ప్రాంత ప్రజలు ఉపాధి కోసం విశాఖపట్నం వెళ్లేవారు. పరిశ్రమల ఏర్పాటుతో అనకాపల్లి జిల్లాలోనే భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతోపాటు.. విశాఖ డివిజన్ పరిధిలోకి వెళ్లిన అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి రైల్వే స్టేషన్‌లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి చెరుకు, మామిడి పంట ఎగుమతి అవుతున్నాయి. అలాగే యలమంచిలి, పాయకరావుపేటలో మామిడి తాండ్ర కుటీర పరిశ్రమతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సమీపంలోనే మంచినీటి సరస్సు ఉండటంతో పర్యాటక పరంగానూ అభివృద్ధి జరుగుతోంది.పరవాడ, అచ్యుతాపురంలో పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అనకాపల్లి విశాఖపట్నానికి దాదాపు 40 కిలో మీటర్ల దూరంలో ఉంది.. గంటలోపే విశాఖపట్నం నుంచి అనకాపల్లి చేరుకోవచ్చు. రాబోయే రోజుల్లో విశాఖపట్నం, అనకాపల్లి జంట నగరాలుగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే అనకాపల్లిలోని కొన్ని ప్రాంతాలు విశాఖపట్నంలో కలిసిపోయాయి. రాబోయే రోజుల్లో పరిశ్రమలతో పాటుగా ఐటీ కంపెనీలను అనకాపల్లి వరకు విస్తరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ కారణాలతో అనకాపల్లి జిల్లాలో రియల్ బూమ్ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో చాలామంది ముందు చూపుతో అక్కడ భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# అయ్యన్న వారసులకు లైన్ క్లియర్

శ్రీకాకుళం, జూన్ 9, ఏపీలో ఇప్పుడు అందరి దృష్టి నర్సీపట్నం నియోజకవర్గం పై పడింది. అక్కడ టిడిపి నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా కూడా ఉన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో తప్పుకుంటానని అయ్యన్నపాత్రుడు పలుమార్లు ప్రకటించారు. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకుని కూడా ఇదే మాట చెప్పారు. వయసు రీత్యా అయ్యన్నపాత్రుడు క్రియాశీలక రాజకీయాలకు దూరం కావడం ఖాయం. ఎందుకంటే స్పీకర్ లాంటి గౌరవప్రదమైన, రాజ్యాంగబద్ధ పదవి అనుభవిస్తుండడంతో ఆయన పొలిటికల్ గా రిటైర్మెంట్ అవుతారు. అయితే ఆయన తరువాత నర్సీపట్నం నుంచి ఎవరు పోటీ చేస్తారు అనేది ఇప్పుడు ప్రశ్న. నిన్నటి వరకు ఆ నియోజకవర్గ బాధ్యతలు చూసేవారు ఆయన కుమారుడు విజయ్. ఇప్పుడు రాజ్యసభకు ఎంపిక కావడంతో మరింత యాక్టివ్ అవుతారు. కానీ నర్సీపట్నం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ ఆయనకు లేదు.



ఎందుకంటే ఆయన ఆరేళ్లపాటు రాజ్యసభ పదవిలో ఉంటారు. అందుకే ఇప్పుడు నర్సీపట్నంపై పెద్ద చర్చ నడుస్తోంది.అయ్యన్నపాత్రుడు తెలుగుదేశం పార్టీకి అత్యంత వీర విధేయుడు. అదే సమయంలో ముక్కుసూటి మనిషి కూడా. టిడిపి ఆవిర్భావం నుంచి అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు అయ్యన్నపాత్రుడు. ఎన్ని పార్టీల నుంచి ఆహ్వానం వచ్చినా ఆయన మాత్రం వెళ్లలేదు. పార్టీ కష్ట కాలంలో ఉంటే సైలెంట్ గా ఊరుకోలేదు కూడా. తనలోనున్న ఫైర్ బ్రాండ్ ఎప్పటికీ తగ్గలేదు. అయితే తండ్రి మాదిరిగానే దూకుడుగా ఉండేవారు విజయ్. అదే ఆయనకు కలిసి వచ్చింది. రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేసేందుకు దోహద పడింది. సుదీర్ఘకాలం ఐటీడీపీకి సేవలు అందించారు విజయ్. ఈ క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో వెంటాడిన భయపడలేదు. వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి విజయ్ పోటీ చేస్తారని అంతా ప్రచారం నడిచింది. కానీ ఇప్పుడు రాజ్యసభకు ఎంపిక కావడంతో అయ్యన్న వారసుడు ఎవరు అనేది ప్రశ్న.2029 ఎన్నికల నాటికి విజయ్ తన రాజ్యసభ పదవిని మూడేళ్ల పాటు పూర్తి చేసుకుంటారు. అప్పటికి మూడేళ్ల సమయం ఉంటుంది ఆయనకు. అయితే రాజ్యసభకు రాజీనామా చేసి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగుతారా? ఆ రాజ్యసభ పదవికి వేరొకరికి ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. పోనీ విజయ్ కాకుంటే ఇతర నేతలకు టికెట్ ఇస్తామంటే.. అయ్యన్న కుటుంబానికి కాదని టిడిపి శ్రేణులు ఆదరించే అవకాశమే లేదు. అయితే అయ్యన్నపాత్రుడు రెండో కుమారుడు రాజేష్ ఉన్నారు. ప్రస్తుతం నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరిస్తున్నారు. రాజేష్ ను పోటీలో పెట్టి అయ్యన్నపాత్రుడు తో పాటు విజయ్ గెలిపించుకుంటారన్న టాక్ ఉంది.. మొత్తానికి అయితే అయ్యన్నపాత్రుడు తన పెద్ద కుమారుడిని రాజ్యసభకు పంపించి.. చిన్న కుమారుడిని ఎమ్మెల్యేగా చేసి.. పిల్లలిద్దరి రాజకీయ భవిష్యత్తును చూసి ఆనందిస్తారన్నమాట. కానీ చాలా రాజకీయ కుటుంబాలు ఉన్నాయి కానీ.. అయ్యన్నపాత్రుడు లాంటి అవకాశం ఎవరికీ దక్కదన్న మాట.

# కాసులు కురిపిస్తున్న కందులు...

కర్నూలు, జూన్ 9, (న్యూస్ పల్స్)నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి.. రైతులు ఖరీఫ్ సాగు కోసం సిద్ధమయ్యారు. ఈ ఏడాది రాయలసీమ రైతులు ఎక్కువశాతం కందిని సాగు చేయాలని చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అధిక విస్తీర్ణంలో వేరుశెనగ సాగు కోసం విత్తనాల పంపిణీకి సిద్ధమైంది. వేరుశెనగ మొత్తం 2.20 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ లక్ష్యం పెట్టుకున్నారు. రాష్ట్రంలో కంది విత్తనాలను 6,172 క్వింటాళ్లు రాయితీపై అందిస్తోంది.. ఈ విత్తనాలు లక్ష ఎకరాల వరకు సరిపోతుందని అంచనా వేస్తున్నారు. కంది విత్తనాలు కిట్స్ రూపంలో ఇస్తే మరో 50వేల ఎకరాలకు అదనంగా సరిపోతాయి. రాయలసీమలో పదేళ్ల క్రితం 2.75 లక్షల ఎకరాలున్న కంది సాగు.. 2025లో 5.59 లక్షల ఎకరాలకు పెరిగింది. వేరుశెనగ విషయానికి వస్తే పదేళ్ల క్రితం 22.58 లక్షల ఎకరాలు ఉంటే.. 2025లో 5 లక్షల ఎకరాలకు పడిపోవడం గమనార్హం.వాస్తవానికి రాయలసీమలో వేరుశెనగను అధికంగా సాగు చేస్తుంటారు. ఏకంగా 20 లక్షల ఎకరాల్లో సాగుచేసేవారు.. కానీ ఆ తర్వాత క్రమంగా సాగు తగ్గుతూ వచ్చింది. వేరుశెనగ సాగు చేయాలంటే పెట్టుబడి రైతులకు భారంగా మారింది. దీనికి తోడు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు వేరుశెనగ సాగుపై ఆసక్తిగా ఉండటం లేదు. గతేడాది కేవలం 5 లక్షల ఎకరాలకు పరిమితమైందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వేరుశెనగ వర్షాధారంగా సాగు చేస్తే రైతుకు ఎకరాకు రూ.35 వేల వరకు ఖర్చవుతోంది. దిగుబడి 2.50 క్వింటాళ్ల నుంచి 4 క్వింటాళ్ల వరకు ఉంటోందని చెబుతున్నారు. వర్షాలు పెరిగినా, అసలు వర్షాలు లేకపోయినా దిగుబడి సరిగా ఉండటం లేదు.. తెగుళ్ల బెడద తప్పడం లేదు.రాయలసీమ రైతులు వేరుశెనగ సాగుకు బదులుగా కంది సాగుపై ఆసక్తిగా ఉన్నారు. రాయలసీమలో 2025 ఖరీఫ్‌లో ఏకంగా 5.59 లక్షల ఎకరాల్లో కంది సాగు చేశారు.

# అందుబాటులోకి భోగాపురం ఎయిర్ పోర్ట్

శ్రీకాకుళం, జూన్ 9, (న్యూస్ పల్స్)మరో నెల రోజుల్లో ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారం కానుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించ బడునుంది. ఎప్పటికీ ప్రైవేటు ఎయిర్‌లైన్స్ తమ సర్వీసులను భోగాపురం నుంచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాయి. దాదాపు ప్రపంచ ప్రఖ్యాత ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ తమ సర్వీస్ లను నడపనున్నాయి. కానీ విశాఖ తో పాటు నగరం అనుసంధానంగా ఉండే ప్రాంతాల నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కు ప్రయాణ భారం కానుంది. అంతర్గత రహదారులు ఉన్నా.. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తేనే రవాణా ఇబ్బందులు తొలగుతాయి. లేకుంటే చాలా ఇబ్బందికరమే. 50 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో రవాణాకు రెండు గంటల సమయం పట్టే అవకాశం ఉంది. విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కు మూడు నుంచి నాలుగు మార్గాలు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఏ మార్గంలో వెళ్లిన గంటన్నరకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీనిపై అధికార యంత్రాంగం కూడా అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు ప్రధానంగా హనుమంతవాక, ఎండాడ, పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, ఆనందపురం మీదుగా భోగాపురం వెళ్లాలంటే కచ్చితంగా 1.50 గంటల సమయం పట్టనుంది.అనకాపల్లి నుంచి భోగాపురం చేరుకోవాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాలి. గంటన్నరలోగా చేరుకోవచ్చు. దానికి కారణం జాతీయ రహదారి ఉండడమే. 16వ నెంబర్ జాతీయ రహదారి ఉంది. అనకాపల్లి నుంచి ఎన్ హెచ్ 16 బైపాస్ మీదుగా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరుకోవచ్చు.. స్టీల్ ప్లాంట్ నుంచి బయలుదేరాలి అనుకుంటే.. విశాఖ నగరానికి టచ్ చేయకుండా లంకెలపాలెం, సబ్బవరం మీదుగా ఎన్‌హెచ్ 16 ఎక్కి ఆనందపురం నుంచి భోగాపురం వెళ్లడానికి 1. 40 గంటల సమయం పడుతుంది. గాజువాక నుంచి కూడా అంతే.. విశాఖ నగరవాసులు భీమిలి మీదుగా చేరుకోవాలి అనుకున్నా గంటన్నర సమయం పడుతుంది హనుమంతువాక నుంచి అడవివరం, ఆనందపురం మీదుగా భోగాపురానికి 1.40 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. అయితే గాపురం ఎయిర్‌పోర్ట్ కు ప్రత్యేకంగా రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కఠిన ఆంక్షలు అమలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వీఎంఆర్డీఏ ఏడు రహదారులను ప్రతిపాదించింది.

# అరటి పండ్లు రోజూ తింటున్నారా..!?



అరటి పండ్లు పోషకాహారంలో భాగంగా తీసుకుంటారు. ఇందులో ః6, విటమిన్ అ పుష్కలంగా ఉంటాయి. మెగ్నీషియం, పొటాషియం మాంగనీస్, ఫైబర్ లు అరటి పండులో మెండుగా ఉంటాయి. అరటి పండ్లు మంచి శక్తి వనరు. అరటిపండ్లలో సహజ కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్) సమృద్ధిగా ఉంటాయి. రోజూ ఒక అరటిపండును నెల రోజులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఊహించని ఫలితాలు కలుగుతాయి. అయితే, ప్రతీ రోజూ అరటి పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదా? కాదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. దీని పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు.అరటి పండును మితంగా తింటే సమస్య ఉండదని డాక్టర్లు చెబుతారు. అరటిపండ్లలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. వాటిలో ఉండే పెక్టిన్ జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. పేగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. అరటిపండ్లలో పొటాషియం కూడా అధికంగా ఉంటుంది. పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అరటిపండ్లు ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లాన్ని అందిస్తాయి. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది.

**మితంగా తీసుకుంటే ప్రయోజనాలు**

అరటి పండు మంచి మానసిక స్థితిని కాపాడుకోవడంలో, ఒత్తిడిని తగ్గించడంలో సెరోటోనిన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పొటాషియం, మెగ్నీషియం కండరాలను బలంగా ఉంచడంలో, తిమ్మిరిని తగ్గించడంలో సహాయపడతాయి. అరటిపండ్లు ఎక్కువగా తినడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. ఇది మూత్రపిండాల సమస్యలు, గుండె క్రమరాహిత్యాలకు కారణమవుతుంది. కానీ ఇది చాలా అరుదు. అయితే అరటి పండ్లు మూత్రపిండ రోగులకు ప్రమాదం. డయాబెటిక్(సుగర్) ఉన్నవారు అరటి పండ్లను తినొద్దు. ఇందులో ఉండే ఫ్రక్టోజ్ రక్తంలో చెక్కర స్థాయిలను పెంచుతుంది. చెక్కెర స్థాయిలు పెరిగితే దానివల్ల ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. షుగర్ లెవెల్స్ ఎక్కువగా ఉన్నవారు వీటి జోలికి పోకపోతేనే మంచిది. నార్మల్ లెవెల్స్ మెయింటేన్ చేసేవారు ఎక్కవగా పండని, దోరగా ఉన్న పండును ఉదయం సగం, సాయంత్రం సగం తినొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో కొవ్వులు ఏమీ ఉండవు.

# "దోసకాయ పెరుగు పచ్చడి" ఇలా చేస్తే యమా టేస్ట్..!



తెలుగు వారి భోజనంలో పెరుగు పచ్చడికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ముఖ్యంగా ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని అందించే వంటకాలలో "దోసకాయ పెరుగు పచ్చడి'' ఒకటి. తక్కువ పదార్థాలతో, తక్కువ సమయంలో తయారయ్యే ఈ పచ్చడి అన్నం, పులావ్, బిర్యానీ, చపాతీ, రోటీలకు అద్భుతమైన కాంబినేషన్‌గా ఉంటుంది. అంతేకాదు, దోసకాయలో ఉండే నీటి శాతం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. కావాల్సిన పదార్థాలు.. దోసకాయ లేదా కీరదోసకాయ – 1 (చిన్న ముక్కలుగా కట్ చేసినది లేదా తురిమినది) గడ్డ పెరుగు – 1 కప్పు పచ్చిమిర్చి – 2 నుంచి 3 (సన్నగా తరిగినవి) ఉప్పు – రుచికి సరిపడా కొత్తిమీర – 2 టేబుల్ స్పూన్లు (సన్నగా తరిగినది) తాలింపు కోసం నూనె – 1 స్పూన్ ఆవాలు – ½ స్పూన్ జీలకర్ర – ½ స్పూన్ మినపప్పు – ¼ స్పూన్ (ఐచ్ఛికం) శనగపప్పు – ¼ స్పూన్ (ఐచ్ఛికం) ఎండు మిర్చి – 1 కరివేపాకు – 1 రెబ్బ ఇంగువ – చిటికెడు (ఐచ్ఛికం) తయారీ విధానం.. మొదట ఒక గిన్నెలో గడ్డ పెరుగు తీసుకుని బాగా చిలకాలి. పెరుగులో ఉండలు లేకుండా మెత్తగా కలుపుకోవాలి. అవసరమైతే ఒకటి రెండు స్పూన్ల నీరు కలపవచ్చు. దోసకాయను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా తరిగి లేదా తురిమి పెరుగులో వేసుకోవాలి. దోసకాయలో నీరు ఎక్కువగా ఉంటే స్వల్పంగా పిండి అదనపు నీటిని తీసేయడం మంచిది. ఇప్పుడు పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. స్టవ్‌పై చిన్న పాన్ పెట్టి నూనె వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడిన తర్వాత మినపప్పు, శనగపప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ఈ తాలింపును పెరుగు–దోసకాయ మిశ్రమంపై పోసి బాగా కలపాలి. అంతే.. రుచికరమైన దోసకాయ పెరుగు పచ్చడి సిద్ధం. మరింత రుచిగా కావాలంటే.. కొద్దిగా తురిమిన క్యారెట్ కలిపితే రంగు, రుచి రెండూ పెరుగుతాయి. ఒక స్పూన్ వేయించిన వేరుశెనగ పొడి కలిపితే ప్రత్యేకమైన ఫ్లేవర్ వస్తుంది. పుదీనా లేదా మెత్తగా నూరిన అల్లం చేరిస్తే మరింత ఫ్రెష్ టేస్ట్ వస్తుంది. బిర్యానీకి సైడ్ డిష్‌గా వాడాలనుకుంటే కొద్దిగా ఉల్లిపాయ ముక్కలు కూడా కలపవచ్చు. ఆరోగ్య ప్రయోజనాలు.. శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వేసవిలో డీహైడ్రేషన్ సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. తక్కువ కేలరీలతో బరువు నియంత్రణకు కూడా ఉపయోగపడుతుంది. సర్వింగ్ సూచన వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకుని ఈ దోసకాయ పెరుగు పచ్చడిని కలిపి తింటే అద్భుతమైన రుచి వస్తుంది. అలాగే చపాతీ, రోటీ, పులావ్, వెజ్ బిర్యానీ, ఫ్రైడ్ రైస్‌లకు కూడా ఇది చక్కటి సైడ్ డిష్‌గా ఉంటుంది.

# అల్లం టీ ఎబ లెమన్ టీ – ఏ సమస్యకు ఏది బెస్ట్..!?



ప్రతీ ఉదయం టీ ఉండాల్సిందే. ప్రతీ ఇంటా ఇది సాధారణం. అనేక మంది పలు రకాల ఫ్లేవర్లు టీ రూపంలో తీసుకుంటారు. మారుతున్న జీవన శైలితో ఆరోగ్య పరమైన టీలు అందుబాటులోకి వచ్చాయి. ఆరోగ్యం పైన అవగాహన పెరుగుతున్న కొద్దీ టీ తీసుకునే వారి అభిరుచుల్లోనూ మార్పు కనిపిస్తోంది. చాలా మంది ఈ మధ్య కాలంలో అల్లం టీ.. లెమన్ టీ వైపు ఆసక్తి చూపుతున్నారు. గ్రీన్ టీ వినియోగం బాగా పెరిగింది. దీంతో.. అసలు ఆరోగ్య పరంగా అల్లం టీ.. లెమన్ టీ ల్లో ఏది ఎవరికి మంచిదనే సందేహాలకు నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. ప్రతీ ఇంటా.. ప్రతీ ఒక్కరి లైఫ్ లో కామన్ మారిన టీ కి సంబంధించి ఆసక్తి కర అంశాలు వెలుగు లోకి వస్తున్నాయి. సాధారణ టీ కంటే ఈ మధ్య కాలంలో అల్లంటీ, లెమన్ టీ తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సమయంలో ఈ రెండు రకాల టీల కోసం ఎక్కువ సంఖ్యలో మొగ్గు చూపుతున్నారు. అల్లంలో ఉండే జింజెరాల్స్ శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. కీళ్ల నొప్పులు, మోకాళ్ల వాపు, గొంతు నొప్పి లేదా దగ్గు ఉన్నప్పుడు ఉదయాన్నే అల్లం టీ తాగడం శరీరానికి ఉపశమనంగా మారుతుంది. అదే విధంగా భోజనం తర్వాత లేదా ఉదయాన్నే తాగితే అజీర్తి, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. వాపును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. అదే విధంగా అల్లం టీ శీతా కాలంలో శరీర వేడిని తగ్గించి...శరీరానికి శక్తిని అందిస్తుందని చెబుతున్నారు. కాగా.. నిమ్మకాయలో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని లోపల నుండి శుభ్రం చేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి లెమన్ టీ బెస్ట్ ఆప్షన్ గా స్పష్టం చేస్తున్నారు.నిపుణుల సూచనలు శరీరంలోని సమస్యలు.. ఆరోగ్య పరమైన అంశాల ఆధారంగానూ టీ ఎంపిక చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. లెమన్ టీ శరీరపు ఫ్యాట్ ద్రవ్యం త్వరగా శక్తిగా మారుతుంది. పని ఒత్తిడిలో ఉన్నవారికి లెమన్ టీ వాసన మనసును ప్రశాంతంగా చేస్తుంది. శరీరంలోని విషతుల్యాలు బయటకు పంపేందుకు దోహదం చేస్తుంది. దీని ద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఉద్యోగాల్లో.. ఇతర సమస్యల్లో ఒత్తిడి.. అలసటగా ఉన్న సమయంలో లెమన్ టీ మూలు చేస్తుంది. ఆలోచనల ను ఫ్రెష్ గా మార్చేందుకు దోహద పడుతుంది. జలుబు, అలసట, అజీర్తి సమస్య ఉంటే అల్లం టీ. బరువు తగ్గడం, మానసిక చురుకుదనం, చర్మ శ్రేయస్సు కోసం లెమన్ టీని తీసుకోవచ్చని నిపుణులు తెలుపుతున్నారు. తయారీలో చేసే సాధారణ తప్పు చాలామంది టీని గంటల తరబడి మరిగిస్తూ ఉంటారు. ఇలా మరిగించటం ద్వారా అల్లం.. నిమ్మలోని ఔషధ గుణాలు తగ్గిపోతాయి. నీటిని మరిగించాక అల్లం తురుము లేదా నిమ్మరసం వేసి రెండు నిమిషాలు మూత పెట్టి ఉంచడం ద్వారా పోషకాలు అందులోని ఉండిపోతాయి. వయసు.. సమస్యల ఆధారంగా ఏ టీ తాగాలో ఎంపిక చేసుకోవటం ద్వారా ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

# సూపర్ టేస్టీ బ్రెడ్ హల్వా.. ఇంట్లోనే ఇలా ఈజీగా తయారు చేసుకోండి..!



పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తినే స్వీట్ రెసిపీల్లో హల్వా ఒకటి. బ్రెడ్ తోనే కాదు ఈ హల్వాల్లో చాలా రకాలు ఉంటాయి. ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్వీట్ ను ప్రిపేర్ చేసుకుంటారు. అందులో బ్రెడ్ హల్వాను చాలామంది ఇష్టంగా తింటారు. ఈ రెసిపీ తయారు చేసుకోవడం కూడా ఈజీనే. మరి ఈ సూపర్ టేస్టీ బ్రెడ్ హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? తయారీ విధానం ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. బ్రెడ్ హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే బ్రెడ్ ముక్కలు ఆరు, నెయ్యి నాలుగు టేబుల్ స్పూన్ లు, పాలు రెండు కప్పులు, చక్కెర ముప్పావు కప్పు లేదా రుచికి సరిపడా, కండెన్స్ డ్ మిల్క్ పావు కప్పు, యాలకుల పొడి అర టీ స్పూన్, కేసరి కొద్దిగా, జీడిపప్పు 10 నుంచి 12, బాదం ఎనిమిది నుంచి పది, పిస్తా ఒక టేబుల్ స్పూన్, ఎండు ద్రాక్ష ఒక టేబుల్ స్పూన్, పాల పొడి ఒక టేబుల్ స్పూన్, గోధుమ రంగు ఫుడ్ కలర్ కొద్దిగా, ఉప్పు రుచికి సరిపడా తీసుకోవాలి. ఇప్పుడు తయారీ విధానం చూస్తే.. ముందుగా బ్రెడ్ ముక్కల్ని అంచులు తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి లేదా చేతితో మెత్తగా చేయాలి. ఇప్పుడు గిన్నెలో నెయ్యి వేసి వేడి చేసి అందులో జీడిపప్పు, బాదం, ఎండు ద్రాక్ష వేసి బంగారం రంగు వచ్చే విధంగా వేయించుకోవాలి. ఆ తర్వాత పక్కకు తీసి పెట్టాలి. ఇప్పుడు అదే గిన్నెలో మిగిలిన నెయ్యి వేసి బ్రెడ్ ముక్కలు వేసి మీడియం ఫ్లేమ్ లో గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేంత వరకూ వేయించుకోవాలి. ఇప్పుడు పాలు పోసి మెల్లగా వేయించుతూ ఉండాలి. బ్రెడ్ పాలను పీల్చుకునేంత వరకూ వేయించుకోవాలి. చక్కెర, కండెన్స్ డ్ మిల్క్, యాలకుల పొడి, కేసరి వేసి బాగా కలపాలి. అలా మిశ్రమం గట్టిగా అయ్యేంత వరకూ వేయించుతూ ఉండాలి. ఇప్పుడు వేయించిన డ్రై ఫ్రూట్స్ , పాల పొడి, ఉప్పు చిటికెడు కలిపి మరో రెండు నిమిషాలు కలుపుకోవాలి. అంతే సూపర్ టేస్టీ బ్రెడ్ హల్వా రెడీ అయినట్టే.. మీరు కూడా ఇంట్లో ఇదే విధంగా ట్రై చేయండి..

# హైదరాబాదీ ఎగ్ మలై మసాలా కర్రీ.. ఇలా చేస్తే రెస్టారెంట్ కు మించిన టేస్ట్..!

గుడ్డులో అనేక పోషకాలు ఉన్నాయి. గుడ్డు సంపూర్ణ ఆహారం అని వైద్యులు చెబుతారు. గుడ్డును రోజూ తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చని అంటున్నారు. గుడ్లను ఉడకపెట్టి తినడం లేదా ఫ్రై మాదిరి చేసుకోవడం చాలామందికి అలవాటే.. అయితే ఎప్పుడూ ఒకే విధంగా కాకుండా రెస్టారెంట్ స్టైల్ లో హైదరాబాదీ ఎగ్ మలై మసాలా కర్రీ ఎప్పుడైనా ట్రై చేశారా..? ఈ కర్రీ చాలా టేస్టీగా ఉంటుంది. ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మరి ఈ హైదరాబాదీ ఎగ్ మలై మసాలా కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? తయారీ విధానం ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం.. హైదరాబాదీ ఎగ్ మలై మసాలా కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. గుడ్లు ఆరు ఉడికించినవి, ఉల్లిపాయలు రెండు సన్నగా తరుక్కోవాలి, పచ్చిమిర్చి మూడు, అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర ఒక టేబుల్ స్పూన్, ధనియాల పొడి ఒక టేబుల్ స్పూన్, గరం మసాలా అర టేబుల్ స్పూన్, మిరియాల పొడి అర టేబుల్ స్పూన్, పసుపు పావు టేబుల్ స్పూన్, కారం పొడి ఒక టేబుల్ స్పూన్, ఉప్పు తగినంత, నూనె లేదా నెయ్యి రెండు టేబుల్ స్పూన్ లు, కొత్తిమీర తగినంత తీసుకోవాలి. హైదరాబాదీ ఎగ్ మలై మసాలా కర్రీ తయారీ విధానం చూస్తే.. ముందుగా కడాయిలో నూనె వేడి చేసి ఉల్లిపాయలు గోల్డెన్ కలర్ లోకి వచ్చేంత వరకూ వేయించుకోవాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి వేసి పచ్చి వాసన పోయేంత వరకూ వేయించుకోవాలి. ఇప్పుడు ధనియాల పొడి, కారం, పసుపు, జీలకర్ర, ఉప్పు వేసి కాసేపు మసాలా వేయించాలి. ఇప్పుడు కొద్దిగా నీళ్లు పోసి మసాలా బాగా చిక్కబడేంత వరకూ ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉడికించిన గుడ్లు వేసి మసాలాతో బాగా కలుపుకోవాలి. ఇప్పుడు అలాగే కలుపుతూ మరో ఐదు నిమిషాలు ఉడికించుకోవాలి. చివరగా గరం మసాలా, మిరియాల పొడి వేసి కలుపుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఆ తర్వాత తరిగిన కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడి వేడిగా సర్వింగ్ చేసుకుంటే సరి.. సూపర్ టేస్టీ హైదరాబాదీ ఎగ్ మలై మసాలా కర్రీ రెడీ అయినట్టే..

# కేవలం 15 నిమిషాల్లో పాలను పెరుగులా మార్చే ట్రిక్ ఇదే..!

తెలుగు ఇళ్లలో భోజనం చివరగా పెరుగుతో ముగించడం ఒక ఆనవాయితీ. పప్పు, కూరలు, పచ్చళ్లు ఎన్ని ఉన్నా చివర్లో ఒక ముద్ద పెరుగు అన్నం తినకపోతే భోజనం పూర్తయిన భావన చాలామందికి కలగదు. ముఖ్యంగా వేసవికాలంలో పెరుగు శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కొన్నిసార్లు పాలు తోడు పెట్టడం మర్చిపోవడం లేదా వెంటనే పెరుగు అవసరం రావడం జరుగుతుంది. పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. అలాగే శరీరానికి కాల్షియం, ప్రోటీన్, విటమిన్లు అందిస్తాయి. రోజూ ఒక కప్పు పెరుగు తీసుకోవడం వల్ల గట్ హెల్త్ మెరుగుపడటంతో పాటు శరీరానికి చల్లదనం కూడా లభిస్తుంది. ఇకపై పాలు తోడు పెట్టడం మర్చిపోయినా ఆందోళన అవసరం లేదు. ఈ సింపుల్ కుక్కర్ ట్రిక్‌తో కేవలం 15 నిమిషాల్లోనే ఇంట్లోనే కమ్మని, చిక్కటి, గడ్డకట్టిన పెరుగును సిద్ధం చేసుకోవచ్చు. ఆ చిట్కా ఏంటో మీకోసం ప్రత్యేకంగా.. 15 నిమిషాల్లో గడ్డ పెరుగు తయారీ ఇలా.. ముందుగా అర లీటర్ లేదా ఒక లీటర్ పాలను బాగా మరిగించాలి. పాలు మరిగిన తర్వాత వెంటనే దించకుండా, తక్కువ మంటపై మరో రెండు నుంచి మూడు నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వల్ల పాలలోని నీటి శాతం కొంత తగ్గి, పెరుగు మరింత చిక్కగా వస్తుంది. తర్వాత పాలను స్టవ్ మీద నుంచి దించి గోరువెచ్చగా అయ్యే వరకు చల్లారనివ్వాలి. పాలు చాలా వేడిగా ఉన్నా, పూర్తిగా చల్లారిపోయినా పెరుగు సరిగా తయారుకాదు. అందుకే గోరువెచ్చని ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు ఒకటి లేదా రెండు టీస్పూన్ల తాజా పెరుగును తీసుకుని పాలలో వేసి బాగా కలపాలి. పెరుగు కలిపిన తర్వాత గిన్నెకు మూత పెట్టి సిద్ధంగా ఉంచాలి. కుక్కర్ ట్రిక్‌తో త్వరగా పెరుగు..

# స్పోర్ట్స్ న్యూస్

## ప్రియాంశ్ ఆర్య వింత రనౌట్.. అంపైర్ నిర్ణయంపై చర్చ!



శ్రీలంకలోని దంబుల్లా వేదికగా ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా భారత్ ఎ, శ్రీలంక ఎ జట్లు తలపడుతున్నాయి. భారత యువ జట్టుకు శుభారంభం దక్కలేదు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ(14), విధ్వంసకర బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరారు. దీంతో యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య, రుతురాజ్ గైక్వాడ్ జట్టును గాడీలో పెట్టడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రియాంశ్ ఆర్య(32) విచిత్రమైన రీతిలో రనౌట్ అయ్యాడు. శ్రీలంక ఎ వికెట్ కీపర్ కాలు కింద బ్యాట్ చిక్కుకోవడంతో ప్రియాంశ్ క్రీజు చేరలేకపోయాడు. దీంతో అంపైర్ రనౌట్ అని ప్రకటించాడు. ఇది ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. 13వ ఓవర్‌లో రుతురాజ్ గైక్వాడ్ లాంగాఫ్ వైపు బంతిని ఆడాడు. మరో ఎండ్‌లో ఉన్న ప్రియాంశ్ ఆర్యను రెండో పరుగు కోసం అలర్ట్ చేశాడు. మొదట అంగీకరించిన ప్రియాంశ్ తర్వాత సందిగ్ధంలో పడ్డాడు. చివరకు ఇద్దరూ ఒకే ఎండ్‌కు చేరుకోవడంతో తిరిగి క్రీజ్‌లోకి రావడానికి ప్రయత్నించాడు. ఇదే సమయంలో వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా కాలు కింద ప్రియాంశ్ బ్యాట్ ఇరుక్కుపోయింది. దీంతో క్రీజ్‌ను చేరుకునేలోపే రనౌట్ అయ్యాడు. రీప్లేలో ప్రియాంశ్ బ్యాట్ వికెట్ కీపర్ కాలు కింద చిక్కుకున్న విషయం స్పష్టంగా కనిపించింది. థర్డ్ అంపైర్ దానిని పరిగణనలోకి తీసుకోకుండా ఔట్‌గా ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. బ్యాట్ కీపర్ కాలు కిందకి వెళ్లకుండా ఉంటే ప్రియాంశ్ ముందుగానే క్రీజ్‌లోకి చేరేవాడని అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయపడుతున్నారు. ప్రియాంశ్ ఆర్య రనౌట్‌కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఫిట్.. ఆఫ్ఘన్‌తో వన్డేలకు క్లియరెన్స్

ముల్లాన్‌పూర్: టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఆదివారం నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డేలు జరగనున్నాయి. ఫస్ట్ వన్డే ధర్మశాలలో ఆడనున్నారు. అయితే పాండ్యా పూర్తిగా ఫిట్‌గా ఉన్నట్లు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన నిపుణుల బృందం పేర్కొన్నది. పాండ్యాకు ఆ టీమ్ క్లియరెన్స్ ఇచ్చింది.



బెంగుళూరులోని సెంటర్‌లో అతను పూర్తి స్థాయిలో 10 ఓవర్లు బౌలింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ ముంబై ఇండియన్స్ తరపున కెప్టెన్స్ చేపట్టిన పాండ్యా వెన్ను నొప్పి వల్ల కొన్ని మ్యాచ్‌లు ఆడలేదు. దీంతో అతను జూన్ రెండో తేదీ నుంచి బెంగుళూరు సెంటర్‌లో శిక్షణ పొందాడు. కోలుకునే దశలో భాగంగా పాండ్యా 10 ఓవర్లు బౌలింగ్ చేశాడని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం పాండ్యా ఫిట్‌నెస్ బాగానే ఉందని, అన్ని పారామీటర్స్ సరిగ్గా ఉన్నట్లు సీఈవో కోచ్‌లు తెలిపారు. పాండ్యా ఫిట్‌నెస్ గురించి అప్‌డేట్ తెలియకున్నా, అతను బాగానే ప్రిపేరవుతున్నట్లు తెలిసిందని భారత అసిస్టెంట్ కోచ్ సీతాన్షు కోటక్ తెలిపారు. వైట్‌బాల్ క్రికెట్‌లో పాండ్యా కీలకమైన వ్యక్తిగా మారనున్నాడు. పేస్ బౌలింగ్‌తో పాటు చివరి ఓవర్లలో భారీ షాట్లు ఆడగలడు. ఇక 50 ఓవర్ల వన్డేలో పాండ్యా 10 ఓవర్లు బౌలింగ్ చేయడం చాలా కీలకం కానున్నది. ప్రస్తుతం భారత వన్డే జట్టు చండీఘడ్‌లో శిక్షణ పొందుతోంది. అయితే ఆ టీమ్‌తో పాండ్యా జతకలుస్తాడా లేదా అన్న విషయంపై క్లారిటీ లేదు. ఇక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ప్రస్తుతం బెంగుళూరు సెంటర్‌లోనే ట్రైనింగ్ కొనసాగిస్తున్నాడు.

## నైట్‌క్లబ్‌లో బెన్ స్టోక్స్ గొడవ.. ప్రమాదంలో కెప్టెన్సీ !

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌మళ్లీ గొడవ పడినట్లు తెలుస్తోంది. తాజాగా టీం ప్రోటోకాల్‌ను అతను ఉల్లంఘించాడు. లార్డ్స్‌లో కివీస్‌పై తొలి టెస్టు గెలిచిన తర్వాత అతను పార్టీ చేసుకున్నాడు. చెల్సీలో నైట్‌క్లబ్‌కు వెళ్లాడు. స్టోక్స్‌తో పాటు గస్ అట్కిన్‌సన్ కూడా టీం ఆంక్షలను ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. సారాసెన్స్ అకాడమీ రగ్బీ ప్లేయర్‌తో ఇద్దరు క్రికెటర్లు గొడవ పడినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. దీంతో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఈ ఘటన పట్ల ఆరా తీస్తున్నది. రగ్బీ ప్లేయర్ క్రికెటర్ అట్కిన్‌సన్‌పై పంచ్ విసిరాడు. కానీ ఈసీబీ సెక్యూర్టీ గార్డుకు ఆ పంచ్ తగిలింది. అతనికి కుట్లు కూడా పడ్డాయి.



అయితే ఆ ఘర్షణలో స్టోక్స్, అట్కిన్‌సన్ గాయపడలేదు. క్రికెటర్లు దురుసుగా ప్రవర్తించలేదని ఈసీబీ పేర్కొన్నది. ఘటన జరిగిన ప్రదేశానికి పోలీసులు కూడా రాలేదని తెలిసింది. అయినా కానీ ఆ ఘటన పట్ల దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. వాస్తవానికి ఇటీవల ఇంగ్లండ్ క్రికెట్ కఠిన నియమావళి పాటిస్తున్నది. ఆటగాళ్ల ప్రవర్తన అంశంలో ఫోకస్ పెట్టింది. మిడ్‌నైట్ కర్ఫ్యూ విధించింది. యాషెస్ సిరీస్‌తో సమయంలో ఫిర్యాదులు వెల్లువెత్తడం వల్ల మిడ్‌నైట్ కర్ఫ్యూలో భాగంగా క్రికెటర్లు నైట్‌క్లబ్‌లకు వెళ్లవద్దు అని ఈసీబీ ఆదేశించింది. కానీ కివీస్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టు తర్వాత ఆటగాళ్లు సెలబ్రేట్ చేసుకున్నారు. ఇక స్టోక్స్, అట్కిన్‌సన్ మాత్రం నిర్దేశిత సమయం ముగిసిన తర్వాత కూడా క్లబ్‌లోనే ఉన్నారు. దీని వల్ల ఓ రగ్బీ ఆటగాడితో గొడవ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన బెన్ స్టోక్స్ భవితవ్యం ప్రమాదంలో పడింది. అతన్ని కెప్టెన్సీ నుంచి శాశ్వతంగా తొలగించే అవకాశాలు ఉన్నాయి. ఓవల్‌లో జరిగే రెండో టెస్టుకు బెన్ స్టోక్స్ ను నుంచి తప్పించనున్నారు. అట్కిన్‌సన్‌ను కూడా జట్టు నుంచి తొలగించే అవకాశాలు ఉన్నాయి. హ్యారీ బ్రూక్ రెండో టెస్టుకు కెప్టెన్సీ చేపట్టనున్నాడు. అయితే 2017లో కూడా ఓసారి బెన్ స్టోక్స్ నైట్‌క్లబ్‌లో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.

## ఐపీఎల్ నుంచే టెస్టు క్రికెట్‌కు సిద్ధమయ్యా: మానవ్ సుతార్

అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అరంగేట్ర మ్యాచ్‌లోనే యువ స్పిన్నర్ మానవ్ సుతార్ 7 వికెట్లతో సత్తా చాటి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. తాజాగా తన అరంగేట్ర అనుభవాలను సుతార్ పంచుకున్నాడు. టెస్టు జట్టులో అవకాశం వస్తుందనే సంకేతాలు వచ్చినప్పటి నుంచే ఐపీఎల్ సమయంలోనూ ఎర్రబంతితో ప్రాక్టీస్ ప్రారంభించినట్లు వెల్లడించాడు. 'కోచ్ గంభీర్ సర్, కెప్టెన్ గిల్ భయ్యా ఐపీఎల్ సమయంలోనే నాకు టెస్టు అరంగేట్రం చేసే అవకాశం వస్తుందని చెప్పారు. ఆ క్షణం నా జీవితాంతం గుర్తుండిపోతుంది. భారత్ తరపున టెస్టు క్రికెట్ ఆడటం నా కల మాత్రమే కాదు.. నా కుటుంబం కల కూడా. చిన్నప్పటి నుంచి టెస్టు క్రికెటర్ కావడమే నా లక్ష్యం. అఫ్గాన్‌తో టెస్టు మ్యాచ్ కోసం నా పేరు పరిశీలనలో ఉందని తెలిసిన తర్వాత ఐపీఎల్ సమయంలో కూడా ఎర్రబంతితో ప్రాక్టీస్ చేశాను. అవకాశం వస్తే ఎలా బౌలింగ్ చేయాలన్న దానిపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాను. ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా మూడు, నాలుగు సుదీర్ఘ ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించాను' అని మానవ్ సుతార్ వెల్లడించాడు. 'అఫ్గాన్ ప్లేయర్లు బౌలింగ్ చేస్తున్నప్పుడు బంతి కొద్దిగా టర్న్ అవుతున్నట్లు గమనించాను. నేను బ్యాటింగ్ చేసినప్పుడు కూడా కొన్ని బంతులు ఆగి వచ్చాయి. దీంతో స్పిన్నర్లకు పిచ్ అనుకూలిస్తుందని అర్థమైంది. తొలి ఓవర్ నుంచే బంతి తిరగడంతో నా టెక్నిక్ పాటించాను. వర్కౌట్ అయింది. అరంగేట్ర మ్యాచ్‌లో సాధించిన తొలి వికెట్ ఎప్పటికీ నా ఫేవరెట్. ఆ వికెట్‌కు ముందు మంచి పోటీ నడిచింది. నేను మాత్రం ఒకే ప్రాంతంలో నిరంతరం బంతులు వేయడంపైనే దృష్టి పెట్టాను. చిన్నప్పటి నుంచే స్పాట్ బౌలింగ్‌పై దృష్టి పెట్టడం వల్లే నాలో ఈ స్థిరత్వం వచ్చింది' అని సుతార్ పేర్కొన్నాడు.

## పాకిస్థాన్‌లోనే ఆడాం.. భారత్‌లో ఆడలేమా?: లిటన్ దాస్

భారత్–శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి బంగ్లాదేశ్ వైదొలిగిన సంగతి తెలిసిందే. దానికి బంగ్లా క్రికెట్ బోర్డు భద్రతాపరమైన కారణాలను సాకుగా చూపి భారత్‌లో ఆడబోమని తేల్చి చెప్పింది. ఐసీసీ సర్దిచెప్పడానికి ప్రయత్నించినప్పటికీ.. బంగ్లా క్రికెట్ బోర్డు మొండి వైఖరి ప్రదర్శించింది.



అయితే నాటి పరిస్థితులపై బంగ్లాదేశ్ టీ20 కెప్టెన్ లిటన్ దాస్ తాజాగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. బీసీబీ తీసుకున్న నిర్ణయంతో బంగ్లా ప్లేయర్లు ఏకీభవించలేదని వెల్లడించాడు. 'ఆ నిర్ణయం పూర్తిగా బోర్డు పెద్దలదే. అందులో ప్లేయర్ల పాత్ర లేదు. బోర్డు అధికారులు మాకు భారత్‌లో భద్రత లేదని చెప్పారు. అప్పుడు మేం వారితో.. 'మేమంతా పాకిస్థాన్‌లో కూడా ఆడాం కదా. అక్కడైతే మా గదుల బయట తుపాకులు పట్టుకుని నిల్చునే వారు. ఇంతకన్నా ప్రమాదకరమైన పరిస్థితులు ఇంకేముంటాయి. పాక్‌లోనే ఆడినప్పుడు.. భారత్‌లో ఎందుకు ఆడలేం' అని మేము అధికారులను ప్రశ్నించాం' అని లిటన్ దాస్ తెలిపాడు. ఆటగాళ్లు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సమష్టిగా టోర్నీలో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నాయని క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఇంతకుముందు పేర్కొన్నారు. ఈ వాదనను కూడా లిటన్ ఖండించాడు. టీ20 ప్రపంచ కప్ 2026కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చాయి. బంగ్లాదేశ్ తన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలో నిర్వహించాలని కోరుతూ హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదించింది. భద్రతా కారణాలను సాకుగా చూపుతూ భారత్‌లో ఆడబోమని స్పష్టం చేసింది. అయితే ఐసీసీ భద్రతా పరిస్థితులను సమీక్షించిన తర్వాత బంగ్లాదేశ్‌కు ఎలాంటి ముప్పు లేదని తేల్చింది. దీంతో మ్యాచ్‌లను తరలించాలన్న బీసీబీ ప్రతిపాదనను ఐసీసీ తిరస్కరించింది. చివరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ఆడాలి.. లేదంటే టోర్నీ నుంచి తప్పుకోవాల్సి ఉంటుందని ఐసీసీ స్పష్టం చేయడంతో బంగ్లాదేశ్ వైదొలిగింది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్ జట్టుకు అవకాశం లభించిన సంగతి తెలిసిందే.

## సిరాజ్‌కు విశ్రాంతి.. జట్టులోకి స్టార్ పేసర్



భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు వెళ్లనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను టీ20 జట్టు నుంచి తప్పించింది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అతడి స్థానంలో మరో స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను జట్టులోకి ఎంపిక చేసింది. 'వైద్య బృందం, జట్టు యాజమాన్యంతో చర్చించిన అనంతరం సిరాజ్‌కు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించాం. రాబోయే సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందుస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇటీవలి ప్రదర్శనల ఆధారంగా ప్రసిద్ధ్ కృష్ణను సిరాజ్ స్థానంలో భర్తీ చేశాం' అని బీసీసీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జూన్ 26 నుంచి భారత జట్టు ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత జులై 1 నుంచి జులై 11 వరకు ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల్లో తలపడనుంది. దీనికి సంబంధించి తొలుత ప్రకటించిన జట్టులో సిరాజ్‌కు చోటు దక్కింది. కానీ వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ దృష్ట్యా అతడిని తప్పించి ప్రసిద్ధ్ కృష్ణను బీసీసీఐ తాజాగా ఎంపిక చేసింది. శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబె, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ

## ట్రై సిరీస్: రుతురాజ్ సెంచరీ.. శ్రీలంక ఎ టార్గెట్ ఎంతంటే?

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంకలోని దంబుల్లా వేదికగా భారత్ ఎ, శ్రీలంక ఎ జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత యువ జట్టు.. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 277 పరుగులు చేసింది. శ్రీలంక ఎకి 278 పరుగుల టార్గెట్‌ను నిర్దేశించింది. స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్(101) సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ తిలక్ వర్మ(60) హాఫ్ సెంచరీ చేశాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఎ జట్టుకు శుభారంభం దక్కలేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ(14) తీవ్రంగా నిరాశపర్చాడు. మరో విధ్వంసకర బ్యాటర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2) స్వల్ప స్కోరుకే పెవిలియన్ బాట పట్టాడు. దూకుడుగా ఆడుతున్న ప్రియాంశ్ ఆర్య(32) విచిత్రమైన రీతిలో రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రుతురాజ్, తిలక్ వర్మ భారీ షాట్లతో అదరగొట్టారు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు 150 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆయుశ్ బదోని(24) విఫలమయ్యాడు. సుర్యాంశ్ షెడ్గె(26×), అనుకుల్ రాయ్(1×) నాటౌట్‌గా నిలిచారు. శ్రీలంక ఎ బౌలర్లలో షిరాజ్ 2, చమికా కరుణరత్నే 1, గరుకా సంకేత్ 1, వానుజా సహన్ 1 వికెట్ పడగొట్టారు.



## ట్రై సిరీస్: నిరాశపరిచిన వైభవ్ సూర్యవంశీ

శ్రీలంక వేదికగా ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక ఎ, భారత్ ఎ జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన యువ భారత జట్టు కాస్త తడబడుతోంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. విదేశీ పిచ్‌పై రాణించలేకపోయాడు. వైభవ్ సూర్యవంశీ దూకుడు ఇన్నింగ్స్‌కు అలవాటు పడిన అభిమానులకు నిరాశే ఎదురైంది. వైభవ్ 12 బంతుల్లో కేవలం 14 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మూడు ఫోర్లతో దూకుడుగా ఆడుతున్నట్లు కనిపించనప్పటికీ మహ్మద్ షిరాజ్ వేసిన బంతిని భారీ షాట్ కొట్టేందుకు ప్రయత్నించిన వైభవ్.. మిడాఫ్‌లో దొరికిపోయాడు.



వైభవ్ కొట్టిన బంతిని సాహన్ అరాచిగే ఎలాంటి పొరపాటు చేయకుండా క్యాచ్ అందుకున్నాడు. మరో విధ్వంసకర ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(2) కూడా తక్కువ స్కోర్‌కే పెవిలియన్ చేరాడు. 11 బంతులు ఎదుర్కొన్న ప్రభ్‌సిమ్రన్.. కేవలం 2 పరుగులే చేయగలిగాడు. కరుణారత్నే బౌలింగ్‌లో సమరవిక్రమకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో స్వల్ప స్కోర్‌కే భారత్ ఎ జట్టు 2 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ వార్త రాసే సమయానికి 13 ఓవర్లు ఆడిన భారత యువ జట్టు.. 68 పరుగులు చేసింది. క్రీజులో రుతురాజ్ గైక్వాడ్(18×), ప్రియాంశ్ ఆర్య(32×) ఉన్నారు.

# షూటింగ్ తో పాటే అప్డేట్స్ కూడా మొదలు..

## అనిల్ గేమ్ ప్లాన్ అదుర్స్



: టాలీవుడ్ లో సినిమా అనౌన్స్ చేసిన రోజు నుంచి రిలీజయ్యే వరకు ప్రేక్షకుల్లో ఆ సినిమా గురించి ఆసక్తిని పెంచగల డైరెక్టర్ల లిస్ట్ లో అనిల్ రావిపూడి పేరు ముందు వరుసలో ఉంటుంది. అనిల్ తన సినిమాల విషయంలో కేవలం షూటింగ్ మాత్రమే కాకుండా, ప్రమోషన్స్ విషయంలోనూ ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్తూ ఉంటారు. అలాంటి అనిల్ ఇప్పుడు మరోసారి తన స్టైల్‌ను చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న భారీ మల్టీస్టారర్ సినిమా జూన్ 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తి కావడంతో చిత్రబృందం షూటింగ్‌కు సిద్ధమైంది. అంతేకాకుండా అనిల్ ఎప్పటిలాగే ఈ సినిమాను కూడా సంక్రాంతి బరిలోకి తీసుకురావాలనే టార్గెట్ గా పెట్టుకుని, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాడని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ం అనిల్ రావిపూడి కెరీర్‌ను పరిశీలిస్తే, ఆయన పని విధానం ఇతర డైరెక్టర్లతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుంది. ఒకసారి కథ, స్క్రీన్‌ప్లే, షూటింగ్ ప్లాన్ లాక్ అయితే ఇక వెనక్కి తిరిగి చూడడు. షూటింగ్ ప్రారంభమైన దగ్గర నుంచి ప్లాన్ చేసిన షెడ్యూల్ ప్రకారమే వేగంగా పనులు పూర్తి చేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే నిర్మాతలు కూడా అనిల్‌తో పనిచేయడానికి ఆసక్తి చూపుతుంటారు. ఇప్పుడు వెంకటేష్, కళ్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా విషయంలోనూ అదే స్పీడ్ కనిపించబోతోందని తెలుస్తోంది. ముఖ్యంగా జూన్ 22 నుంచి షూటింగ్ మొదలవుతుండటంతో పాటు, సినిమా యూనిట్ నుంచి వరుస అప్‌డేట్లు, సెట్స్ ఫొటోలు, వీడియోలు, ప్రత్యేక ప్రమోషనల్ కంటెంట్ కూడా విడుదల చేసే అవకాశం ఉందని ఇండస్ట్రీలో అప్పుడే చర్చ మొదలైంది. ఈ సినిమాను మొదలుపెట్టిన దగ్గర నుంచి షూటింగ్ పూర్తా, రిలీజయ్యే వరకు ప్రేక్షకుల దృష్టి ఎప్పుడూ ఈ ప్రాజెక్ట్‌పైనే ఉండేలా అనిల్ ప్లాన్ చేస్తున్నాడని సమాచారం. ఇక అనిల్ రావిపూడి తన సినిమాలకు ప్రమోషన్స్ కూడా చాలా ముందుగానే మొదలుపెడతాడనే విషయం తెలిసిందే. చాలా మంది డైరెక్టర్లు సినిమా రిలీజ్ టైమ్ దగ్గర పడుతున్నప్పుడే ప్రమోషనల్ ఈవెంట్స్ ను మొదలుపెడితే, అనిల్ మాత్రం షూటింగ్ మొదలైనప్పటి నుంచే ఆ ప్రాజెక్టును చాలా స్పెషల్ గా వార్తల్లో నిలబెడతాడు. సోషల్ మీడియా యుగంలో ఆడియన్స్ దృష్టిని ఎలా ఆకర్షించాలో బాగా తెలిసిన డైరెక్టర్ గా అనిల్ కు మంచి పేరుంది. అందుకే జూన్ 22 నుంచి ఈ ప్రాజెక్ట్ చుట్టూ హడావిడి మొదలవుతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వెంకటేష్ కామెడీ టైమింగ్, కళ్యాణ్‌రామ్ స్క్రీన్ ప్రెజెన్స్, అనిల్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలవడంతో ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. సంక్రాంతి 2027 రిలీజ్ అంటే, ఇంకా చాలా టైమ్ ఉన్నప్పటికీ, అనిల్ రావిపూడి తన ప్రచార వ్యూహాలతో ఇప్పటి నుంచే ప్రేక్షకుల దృష్టిని ఈ సినిమాపై నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నాడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జూన్ 22తో ప్రారంభమయ్యే ఈ ప్రయాణం వచ్చే సంక్రాంతి వరకు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా కొనసాగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# మా సినిమాకు రక్షకులు అవసరం లేదు!

: ప్రస్తుతం మాలీవుడ్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. పరిమిత బడ్జెట్‌లతో, వైవిధ్యమైన కథాంశాలతో ప్రాంతీయ సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఈ నేపథ్యంలో చిత్ర పరిశ్రమను ఉద్దేశించి దర్శకుడు అభినవ్ సుందర్ నాయక్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. మాలీవుడ్‌ను ఇప్పట్లో ఏ శక్తీ రక్షించాల్సిన అవసరం లేదని.. ఇప్పటికే అత్యంత సురక్షితమైన.. బలమైన స్థితిలో ఉందనేది అభి ప్రాయంగా చెప్పుకొచ్చారు. ఒకప్పుడు ఏ సినీ పరిశ్రమ అయినా? మనుగడ సాగించాలంటే అగ్ర తారల ఇమేజ్, మాస్ ఎలిమెంట్స్ మాత్రమే దిక్కు అనే భావన ఉండేది. కానీ మలయాళ సినిమా ఈ పాత ఫార్ములాలను పూర్తిగా తిరగరాసింది. అక్కడ స్టార్ పవర్ కంటే కథా బలమే సినిమాను నడిపిస్తోంది. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ కొత్త నటీనటులతో సైతం వందల కోట్ల వసూళ్లను సాధించొచ్చని మాలీవుడ్ నిరూపించిందన్నారు. ఈ స్వయంసమృద్ధి వల్లనే పరిశ్రమకు బయట నుంచి గానీ కృత్రిమ హైప్ గానీ అవసరం లేదన్నారు. మలయాళ చిత్రాల ప్రధాన బలం వాటిలోని సహజత్వం .. ప్రయోగాత్మకత. కమర్షియల్ హంగుల కోసం కథను పక్కన పెట్టకుండా? నిత్య జీవితంలో జరిగే సంఘటనలను..సంబంధాలను ఎంతో లోతుగా ఆవిష్కరిస్తున్నారు. సైకో థ్రిల్లర్ల నుండి ఫీల్ గుడ్ డ్రామాల వరకు ప్రతి జోనర్‌లోనూ సరికొత్త ప్రయోగాలు చేయడం సర్వసాధారణంగా మారింది దర్శకులకు లభిస్తోన్న సృజనాత్మక స్వేచ్ఛ .. నిర్మాతలు చూపిస్తోన్న ధైర్యం మాలీవుడ్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్తున్నాయి. ప్రస్తుతం మలయాళ సినిమాలు కేరళకే పరిమితం కాకుండా పాన్-ఇండియా వ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు, తమిళ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఓవర్సీస్ మార్కెట్‌లో సైతం మాలీవుడ్ సినిమాలు కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నాయి. తమ సంస్కృతిని, మూలాలను వదులుకోకుండానే అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో సినిమాలను తెరకెక్కించడం ప్రత్యేకతగతా మారింది. ఇతర పరిశ్రమలు భారీ బడ్జెట్లతో కొట్టుమి ట్టాడుతుంటే? మాలీవుడ్ మాత్రం తక్కువ వ్యయంతో భారీ లాభాలను అందుకుని ఆదర్శంగా నిలుస్తోంది. పరిశ్రమలో అంతర్గతంగా కొన్ని సవాళ్లు, వివాదాలు ఉన్నప్పటికీ సృజనాత్మకత విషయంలో మాత్రం మాలీవుడ్ వెనక్కి తగ్గలేదు. అభినవ్ సుందర్ నాయక్ లాంటి నూతన తరం దర్శకులు ఇండస్ట్రీలోని లోపాలను ఎత్తి చూపుతూనే సినిమా మేకింగ్ శైలిని ప్రశంసిస్తున్నారు. బాహ్య ప్రపంచం మాలీవుడ్‌ను ఓ సంక్షోభంలో ఉన్నట్లుగా చూడాల్సిన పనిలేదని.. ప్రస్తుత విజయాల పరంపర పరిశ్రమ అసలు సత్తాను చాటోతోందని బలంగా నమ్ముతున్నారు. మలయాళ సినిమా సాధిస్తున్న ఘన విజయాలు మిగిలిన భారతీయ చలనచిత్ర పరిశ్రమలకు గొప్ప పాఠంగా చెప్పొచ్చు. భారీ తారాగణం, కళ్లు చెదిరే గ్రాఫిక్స్ మాత్రమే సినిమాను రక్షించలేవని ప్రేక్షకుల హృదయాలను తాకే కథలు మాత్రమే పరిశ్రమను నిలబెడతాయని మాలీవుడ్ చాటి చెబుతుంది.





# సినిమా

## రామాయణ, వారణాసి బడ్జెట్ లెక్కలు

### హైప్ క్రియేట్ చేస్తున్నారని కొట్టి పారేసిన మనోజ్

రామాయణ' పై 4000 కోట్ల బడ్జెట్ పెట్టారు. పాన్ ఇంటర్నేషనల్ మూవీ 'వారణాసి', 1300 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోంది. రామాయణ, వారణాసి బడ్జెట్ షాక్ ఇస్తోంది. అయితే ఇందులో ఎంతమాత్రం నిజం లేదని ఇదంతా కేవలం హైప్ క్రియేట్ చేయడానికే అని బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్ తేల్చి పారేసాడు. రాజమౌళి అంటేనే బ్జడెట్. తెలుగు తెరకే కాదు, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌కు భారీ బ్జడెట్, భారీ వసూళ్లు ఎలా ఉంటాయో చూపించాడు రాజమౌళి. తెలుగు సినిమా బ్జడెట్ 20 కోట్ల లోపే ఉన్న సమయంలో, 'మగధీర' పై 40 కోట్లు పెట్టించాడు. బాక్స్ ఆఫీస్ దగ్గర 50 కోట్ల మార్కు దాటిన తొలి చిత్రంగా 'మగధీర' నిలిచింది. ఇక 'బాహుబలి 2' తో రాజమౌళి సెట్ చేసిన రికార్డులు ఇప్పటికీ కొన్ని చోట్ల పదిలంగానే ఉన్నాయి. మరి ఇంత ట్రాక్ రికార్డు ఉన్న రాజమౌళి, 'వారణాసి' తో పాన్ ఇంటర్నేషనల్‌కు పరిచయం అవుతున్నాడు. దీనికి తగ్గట్టే బ్జడెట్ పెంచేసాడు. 'వారణాసి' 800 కోట్ల బ్జడెట్‌తో మొదలైంది. సెట్స్ పైకి వెళ్ళాక 1000 కోట్లు అన్నారు. ఏడాది పాటు షూటింగ్ పూర్తి చేశాక, 1300 కోట్లకు వెళ్ళిందన్నారు. సినిమా పూర్తి అయ్యేసరికి 1500




కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. బాలీవుడ్ యాక్టర్ మనోజ్ బాజ్‌పాయ్, రామాయణ, వారణాసి బ్జడెట్‌పై చేసిన షాకింగ్ కామెంట్స్ వైరల్ అయ్యాయి. ఈ సినిమాల బ్జడెట్ లెక్కలన్నీ కేవలం పిఆర్ టీం స్టంట్ అని ఆయన అభిప్రాయపడ్డాడు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఇదే తంతు నడుస్తోందని, హైప్ కోసం చెప్పే నంబర్స్ అంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 4 వేల కోట్ల బ్జడెట్‌తో హిందీ 'రామాయణ' తెరకెక్కుతోంది. ఒక్కో పార్ట్‌కు 2000 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దాదాపు సగం పైగా బ్జడెట్ విఎఫ్ఎక్స్ కే ఖర్చు పెడుతున్నారట. ఎన్ని కోట్లు పెట్టినా 4000 కోట్ల బడ్జెట్ అనేది నమ్మేలా లేదంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మనోజ్ బాజ్‌పాయ్ చెప్పిన పిఆర్ టీం బ్జడెట్ లెక్కల్లో ఎంత నిజం ఉందో లేదో గానీ, ఈ కామెంట్స్ పెద్ద చర్చకు దారితీశాయి. మనోజ్ నటిస్తున్న 'గవర్నర్' మూవీ 12న రిలీజ్ అవుతోంది. సినిమా వస్తోందన్న సంగతి చాలామందికి తెలియడం లేదు,

## బాక్సాఫీస్ షేక్ చేసిన 'పెద్ది'.. తొలిరోజు వసూళ్లు ఎంతంటే?




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లీడ్ రోల్ లో బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన స్పోర్ట్స్ డ్రామా పెద్ది మూవీ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. వరల్డ్ వైడ్ గా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ చిత్రం తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు మూవీ టీమ్ ప్రకటించింది. విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొనగా, మొదటి రోజు కలెక్షన్లు ఆ అంచనాలకు తగ్గట్టు ఉండటం విశేషం. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, పాన్ ఇండియా వైడ్ గా సినిమా తొలి రోజు సుమారు రూ.69.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించగా, గ్రాస్ కలెక్షన్లు రూ.82 కోట్లకు పైగా నమోదైనట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్ లో కూడా పెద్దికి మంచి రెస్పాన్స్ లభించింది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల నుంచే సాలిడ్ వసూళ్లు రావడంతో విదేశీ మార్కెట్లలోనూ సినిమా ఎఫెక్ట్ క్లియర్ గా కనిపించింది. వరల్డ్ వైడ్ వసూళ్లు- రూ.135.36 కోట్లు (అఫీషియల్) ఇండియా వైడ్ వసూళ్లు- రూ.82 కోట్లు గ్రాస్ (అంచనా) తెలుగు రాష్ట్రాల వసూళ్లు- రూ.48 కోట్ల గ్రాస్ (అంచనా) రాష్ట్రాల వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. ఆ రెండు రాష్ట్రాల నుంచి రూ.48 కోట్లకు పైగా గ్రాస్ వచ్చినట్లు సమాచారం. కర్ణాటక, తమిళనాడు, కేరళతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ సినిమా సాలిడ్ వసూళ్లు సాధించింది. ముఖ్యంగా నార్త్ లో విడుదలైన సెంటర్స్ లో ఆక్యుపెన్సీ పెరగడం మూవీ టీమ్ కు మరింత ఉత్సాహాన్నిచ్చింది.టికెట్ బుకింగ్ ల పరంగా కూడా పెద్ది మంచి జోరు చూపించింది. తొలి రోజు ప్రీమియర్ షోలతో కలిపి మూడు మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు వార్తలు వస్తున్నాయి. రెండో రోజు, వీకెండ్ అడ్వాన్స్ బుకింగ్ లు కూడా సాలిడ్ రేంజ్ లో ఉండటంతో రానున్న రోజుల్లో సినిమా వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు ఇప్పుడు అంచనా వేస్తున్నారు. ఇక పెద్ది కథ విషయానికొస్తే.. 1990ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే స్టోరీ ప్రేక్షకులను ఎమోషన్స్ కు దగ్గర చేస్తుంది. విజయనగరం జిల్లాలో గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న ఓ చిన్న గ్రామం చుట్టూ కథ తిరుగుతుంది. ఆ గ్రామానికి చెందిన యువకుడు పెద్ది పాత్రలో చరణ్ నటించారు. సాధారణ కూలీగా జీవనం సాగించే అతడు క్రీడలపై ఉన్న ఆసక్తితో ముందుకు సాగుతాడు. పరిస్థితుల కారణంగా తనకు ఇష్టమైన క్రికెట్ ను వదిలి మరో మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది.ఆ తర్వాత అతని జీవితంలో చోటు చేసుకున్న పరిణామాలు, గ్రామానికి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యం, క్రీడల ద్వారా తనను తాను నిరూపించుకోవాలనే పట్టుదల కథలో మెయిన్ ఎలిమెంట్స్. విలేజ్ ఎన్విరాన్మెంట్, స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్, ఎమోషనల్ సీన్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏదేమైనా పెద్ది తొలిరోజు వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ గా కనిపించింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్, వీకెండ్ బుకింగ్స్ లో కూడా జోరు కొనసాగితే పెద్ది చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలుస్తుందనే చెప్పాలి.

## జూలై నుంచి కల్కి-2 రెగ్యులర్ షూటింగ్




ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి వివరణ చేస్తూ.. కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే జూలై నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

Printed by Published by KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH on behalf of KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor RAGHURAMA RAJU KALIDINDI. PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com